తెలంగాణ జాతీయ దినపత్రిక

# ప్రజా మంటలు

సంపుటి : 4
సంచిక : 10
పేజీలు - 8
వెల- రూ 5 : 00
prajamantalu.com

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శనివారం 27, మే 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

అన్ని రంగాల్లో దేశంలోనే

## తెలంగాణ నంబర్‌వన్

- అబద్దాల ప్రచారంలో ముందున్న విపక్షాలు
- నల్లగొండ జిల్లాలో అన్ని సీట్లు గెలుస్తాం
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీష్ రావు



**నల్లగొండ,మే26(ప్రజా మంటలు):** అన్ని రంగాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ గా ఉందని మంత్రి హరీష్ రావు అన్నారు. ఐటీ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. నల్గొండ జిల్లా

మిగతా... 2లో




మోడీ 9 ఏళ్ల పాలనపై

# కాంగ్రెస్ 9 ప్రశ్నలు

- ఇచ్చిన హామీలపై నిలదీసిన నేతలు
- మాఫీ దివస్‌గా ప్రకటించాలని డిమాండ్

**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇవాల్టితో తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో కాంగ్రెస్ (పార్టీ ప్రధానిపై 9 సూటి ప్రశ్నలు సంధించింది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల ఆదాయం వంటి పలు అంశాలపై నిలదీసింది. తొమ్మిదేళ్ల హయాంలో ప్రజలను వంచించినందుకు క్షమాపణ చెప్పాలని, ఈరోజును 'మాఫీ దివస్'గా ప్రకటించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'లో లేవనెత్తిన అంశాల ఆధారంగానే మోదీ సర్కార్‌కు తొమ్మిది ప్రశ్నలు అడుగుతున్నట్టు శుక్రవారంనాడిక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు. దీనికి ముందు, 'నౌ సాల్, నౌ సవాల్' పేరుతో ఒక బుక్‌లెట్‌ను జైరామ్ రమేష్, పార్టీ నేతలు పవన్ ఖేరా, సుప్రియా శ్రినటె విడుదల చేశారు. అనంతరం మీడియాతో జైరామ్ రమేష్ మాట్లాడుతూ, తొమ్మిదేళ్ల క్రితం మోదీ ఇదే రోజు ప్రధాని అయ్యారని, ఆయనను తమ పార్టీ తొమ్మిది ప్రశ్నలు అడగాలని అనుకుంటోందని చెప్పారు. తాము అడిగే తొమ్మిది ప్రశ్నలకు ప్రధాని మౌనం వీడి సమాధానం చెప్పాలనన్నారు. 'ద్రవ్యోల్బణం, నిరుద్యోగం భారతదేశంలో ఉవ్వెత్తున ఎగసిపడటానికి కారణం ఏమిటి? ధనవంతులు మరింత ధనవంతులు, పేదలు మరింత పేదలుగా ఎందుకు మారుతున్నారు ప్రజా ఆస్తులను మోదీ మిత్రులకు ఎందుకు అమ్మేస్తున్నారు? పేదలు, ధనికుల మధ్య అసమానతలు ఎందుకు పెరిగాయి?. నల్లచట్టాలుగా ముద్రపడిన మూడు సాగు చట్టాలను రద్దు చేస్తూ వారితో రైతులతో చేసుకున్న అగ్రిమెంట్లను ఇంతవరకూ ఎందుకు అమలు చేయలేదు? కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేకపోయారు? తొమ్మిదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు ఎందుకు కాలేదు?' అని జైరామ్ రమేష్ వరుస ప్రశ్నలు సంధించారు.

ప్రభుత్వం అవినీతి, ఆశ్రితపక్షపాతానికి పాల్పడుతోందని రమేష్ ఆరోపించారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐలో ప్రజలు కష్టపడి దాచుకున్న సొమ్ములను తన మిత్రుడైన అదానీ ప్రయోజనాలకు ఎందుకు వెచ్చించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. 'బీజేపీ పాలిత ప్రాంతాల్లో విచ్చలవిడి అవినీతిపై ఎందుకు మౌనంగా ఉన్నారు? భారతీయల కడగండ్లను ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని జైరామ్ రమేష్ ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ధి కోసం విద్వేష రాజకీయాలకు ఎందుకు పాల్పడుతున్నారు? సమాజంలో భయాలు పెరుగుతున్న వాతావరణం ఎందుకు కల్పిస్తున్నారు? మహిళలు, దళితులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీలపై జరుగుతున్న అకృత్యాలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? కుల గణన డిమాండ్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదు? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కూడా ఆయన ఆరోపించారు. తద్వారా రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య

మిగతా... 2లో

# ముంగిట ఉపద్రవం..

- కరోనాను మించిన ఉపద్రవం రానుందా?
- ఇప్పటి నుంచే ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి
- గత సంక్షోభంపై అధ్యయనం జరగాలి
- ప్రజల జీవన స్థితిగతులపై పరిశీలన చేయాలి



**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** ప్రపంచం మరో ఉపద్రవం ముగింట ఉందని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ చేసిన హెచ్చరికలతో ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. ఇప్పటికే కరోనాతో ఎంతో నష్టపోయాం. సామా న్యులు నేటికీ కోలుకోవడం లేదు. దేశంతో పాటు, ఆయా రాష్ట్రాల పాల కులు ఎవరి పరిధిలో వారు కరోనా లెక్కలపై కాకిలెక్కలుచెప్పి తప్పించుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన లెక్కలతో పొంతన కుదరడం లేదు. నిజానికి ఈ సంక్షభంలో లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ లెక్కలు చెప్పడానికి కూడా ప్రభుత్వాలు నిజాయితీ చూపడం లేదు. కరోనా దెబ్బకారణంగా అనేక రంగాల ప్రజలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. లక్షలాది మంది ఉద్యోగ,ఉపాధి కోల్పోయారు. లక్షలాదిమంది మృత్యువాత

మిగతా... 2లో

అవినీతిపై ఇడి, సిబిఐలు

# ఏం చేస్తున్నాయి..?

- లిక్కర్ స్కామ్ కన్నా వేయిరెట్లు పెద్దది
- లక్షకోట్ల విలువైన ఔటర్‌ను 7వేలకోట్లకు కట్టబెట్టారు
- బిజెపి నేతలకు ఈ అవినీతి కనిపించడం లేదా
- మీడియా సమావేశంలో మండిపడ్డ రేవంత్



**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** రూ.లక్ష కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును రూ.7వేల కోట్లకు తెగనమ్మారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే ఓఆర్ఆర్ టోల్ స్కామ్ వెయ్యిరెట్లు పెద్దదని విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ టోల్ స్కామ్‌పై కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఎందుకు విచారణ జరిపించట్లేదని నిలదీశారు. 30 రోజుల నిబంధనపై అర్వింద్ కుమార్ ఏం చెబుతారని ప్రశ్నించారు.ఒకవేళ నిబంధనలు ఏమైనా మార్చారా ఆ సమాచారం ఏది? 30 రోజుల్లో 25శాతం చెల్లించాలని ఒప్పందంలో ఉంది.ఇప్పటికీ ఐఆర్‌బీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. నా ఆరోపణలపై బిఆర్ఎస్, బిజెపి నేతలు వివరణ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఓఆర్ఆర్ టోల్ టెండర్ ఢిల్లీ లిక్కర్ స్కాం కంటే వెయ్యి రెట్లు పెద్దదని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. రూ. లక్ష కోట్ల ఆస్తిని కేవలం రూ.7వేల కోట్లకు కట్టబెట్టారని విమర్శిం చారు. ఈ ఓఆర్ఆర్

మిగతా... 2లో



## నేడు కెసిఆర్‌తో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ భేటీ

### కేంద్ర ఆర్డినెన్స్‌పై మద్దతు కోసం కెసిఆర్‌తో చర్చ

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధమయ్యారు. కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌పై పోరాటం చేసేందుకు విపక్షాల మద్దతు కూడగడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో అరవింద్ కేజ్రీవాల్ శనివారం భేటీ కానున్నారు. ఢిల్లీలో అధికారుల బదిలీ, పోస్టింగ్‌లపై కేంద్రం ఆర్డినెన్స్ తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో వ్యతిరేకించాలని విపక్షాలను కేజ్రీవాల్ కోరుతున్నారు. ఈ విషయమై కేజ్రీవాల్ ఇప్పటికే వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ థాకరేలతో కలిసి చర్చించారు. తాజాగా

మిగతా... 2లో



పార్లమెంట్ ప్రారంభోత్సవం

# యధాతథం

- విచారణకు తిరస్కరించిన సుప్రీం కోర్టు
- ఇందులో విచారణాంశం లేదని వ్యాఖ్య
- పిల్ వేసినందుకు అసహనం వ్యక్తం చేసిన సుప్రీం
- యధావిధిగా ప్రారంభోత్సవ ఏర్పాట్లలో స్పీకర్ కార్యాలయం
- పలువురు ప్రముఖుల సమక్షంలో పూజలు, ఇతరకార్యక్రమలు

**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** కొత్త పార్లమెంట్‌ని ప్రధాని మోదీ ప్రారంభించడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. పార్లమెంట్‌ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఓ లాయర్ పిటిషన్ వేశారు. పిటిషన్ల లిస్ట్‌లో ఇది ఉన్నప్పటికీ...సర్వోన్నత న్యాయస్థానం విచారణకు

మిగతా... 2లో

నకిలీ విత్తనాల

# ముఠా పట్టివేత

- ఉత్పత్తిదారులపై ఉక్కుపాదం మోపుతాం
- సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** సగటు రైతుకు అతి పెద్ద సమస్య ఏంటంటే.. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడినప్పుడో, వడగళ్ళు



పడ్డప్పుడో, కరువు వచ్చినప్పుడో కాదు.. ఒక రైతుకు నకిలీ విత్తనాలే ప్రధాన సమస్య అని సైబరా బాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. కరువు వచ్చినప్పుడో, వడగండ్లు పడ్డప్పుడో రైతు 50 శాతం పంట మాత్రమే నష్టపోతాడు.. కానీ నకిలీ విత్తనం మొత్తం రైతును, రైతు కష్టాన్ని తుడిచి పెట్టేస్తుందని ఆయన అన్నారు. తయారీదారు నుండి ఊర్లలో దుకాణదారు వరకు నకిలీ విత్తనాలనేది పెద్ద మాఫియా.. వీళ్ళ లాభం రైతు

మిగతా... 2లో

## ప్రజానాడి




# జూన్ 22 నుంచి బోనాల ఉత్సవాలు

- జులై 9న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు
- గోల్కొండ ఉత్సవాలతో సందడి ప్రారంభం
- బోనాల నిర్వహణకు 15 కోట్లు విడుదల
- అధికారులతో సమీక్షించిన మంత్రులు



**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** నగరంలో ఆషాడ బోనాల తేదీలు ఖారారయ్యాయి. జూన్ 22న గోల్కొండ కోటలోని జగదాంబికా మహంకాళి అమ్మవారికి తొలిబోనంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్ బేగంపేటలోని హరిత ప్లాజాలో బోనాల ఏర్పాట్లపై మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, మల్లారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. 22న గోల్కొండలో ఆషాడ బోనాలు ప్రారంభమవుతాయని, జులై 9న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు, జూన్ 10న రంగం నిర్వహిస్తామని మంత్రి తలసాని తెలిపారు. జులై 16న ఓల్డ్ సిటీ బోనాలు, 17న ఉమ్మడి దేవాలయాల ఆధ్వర్యంలో ఊరేగింపు జరగనుందన్నారు. బోనాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలను సీఎం కేసీఆర్.. రాష్ట్ర పండుగగా ప్రకటించారని

మిగతా... 2లో



## టీఎస్ పాలిసెట్ ఫలితాలు విడుదల

- పరీక్షల్లో 82.17 శాతం ఉత్తీర్ణత నమోదు

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** టీఎస్ పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక భవన్‌లోని తన కార్యాలయంలో నవీన్

మిగతా... 2లో

# మోడీ 9 ఏళ్ల పాలనపై కాంగ్రెస్ 9 ప్రశ్నలు

మొదటిపేజీ తరువాయి..

సంస్థలు గత తొమ్మిదేళ్లుగా బలహీన పడుతున్నాయని అన్నారు. ప్రతి పక్ష పార్టీలు, నేతలపై ఎందుకు ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నారు? ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను ధనబలంతో అస్థిరపరచేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని కూడా నిలదీశారు. కోవిడ్ కావలంలో 40 లక్షల మంది ప్రాణాలు కోల్పేతే వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. అకస్మాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించచడం వల్ల లక్షలాది మంది వసల కార్మికులు తిరిగి ఇళ్లకు చేరుకునేందుకు ఎన్నో పాట్లు పడ్డారని, వారిని ఎందుకు ఆదుకోలేకపోయారని ప్రశ్నించారు. తాము అడిగిన ప్రశ్నలకు ఇప్పటికైనా ప్రధాని మౌనం వీడి సమాధానం ఇవ్వాలని జైరామ్ రమేష్ డిమాండ్ చేశారు.

# ముంగిట ఉపద్రవం..

మొదటిపేజీ తరువాయి..

పడ్డారు. కరోనా సమయంలోనూ పాలకులు పట్టుబట్టి నిర్వహించిన ఎన్నికల పుణ్యమా అని అనేకులు కరోనాకు బలయ్యారు. టీచర్లు ఎందరో మరణించారు. ఇలా మరణించిన వారి కుటుంబాలపై అధ్యయనం చేసి వారిని ఆదుకునే ప్రయత్నాలు చేయాల్సిది పోయి లెక్కలు తక్కువగా చూపి బాధ్యతల నుంచిప్రభుత్వాలు తప్పుకుంటున్నాయి. గతేడాది ప్రధాని మోడీ ప్రకటించిన 20లక్షల కోట్ల ప్యాకేజీ ఏయే రంగాలను ఆదుకున్నదీ లేనిదీ తెలియడం లేదు. తాజాగా ఇచ్చిన ఐదుకిలోల బియ్యం సాయం కూడా పెద్దగా ఒరిగిందేమీ లేదు. అయితే ఈ సంక్షోభంపై అధ్యయనం చేయాలి. గ్రామాల వారీగా లెక్కలు తీయాలి. ఎంతమంది బలయ్యారు..ఏ ఆసుపత్రిలో మరణించారు..వారికి ఎంత ఖర్చయ్యిందీ తెలుసు కోవాలి. ఇలా కోల్పోయిన వారి జీవితాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలి. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనేకులు అనాథలయ్యారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు దిక్కులేని వారయ్యారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు కూడా చనిపోయారు. ఇలా చనిపోయిన వారి విషయంలో సమగ్ర సమాచార సేకరణ నేటికీ జరగడం లేదు. అలాంటి వారికి సాయం అందించేందుకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు. కరోనా వైరస్ మహమ్మారితో దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. సామాన్యుల కష్టాలను విని, చూసి ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు రంగంలోకి దిగి చేతనైనంత చేయడంతో కొందరైనా పొట్టనింపుకోగలిగారు. బతికిబట్ట కలిగారు. అయితే కొందరు నిత్యం అడుక్కుంటే తప్ప పూటగడవని పరిస్థితిలో ఉన్నారు. ఇన్ని అనుభవాల దృష్ట్యా ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. ఈ దేశంలో ఉన్న అభివృద్ధికి సామాన్యులే పునాది రాళ్లు. దేశంలోని సమస్త మౌలిక సదుపాయా లకూ వీరే వెన్నెముక అన్నది కూడా మరవరాదు. ఎందుకంటే అనేక మంది ప్రజలు లక్షల్లో డబ్బులు అప్పుచేసి మరీ ఆస్పత్రులకు ధరాపోశారు. కేంద్రం ఆర్భాటంగా ప్రకటించిన అందించిన ప్యాకేజీ వల్ల మేలు జరిగిందా లేదా అన్నది కూడా తెలుసుకు నేందుకు ప్రయత్నం చేయాలి. ప్రభుత్వానికి విస్తృతమైన యంత్రాంగం ఉన్నందున నివేదికలు తెప్పించు కోవాలి. ఇంటిలిజెన్స్ ద్వారా ప్రజలు ఏమనుకుంటున్నారో సమాచార సేకరణ చేయాలి. అవసరమైతే దెబ్బతిన్న రంగాలకు సంబంధించి వివరాలు తెప్పించుకుని ముందుకు సాగాలి. అప్పుడే కరోనా కష్టాల వల్ల ఎంతమంది ప్రజలు దెబ్బతీన్నారో తెలుస్తుంది. ప్రధానంగా నిత్యకూలీలు ఎదుర్కొటున్న సమస్యలపై తక్షణ చర్యలకు ఉపక్రమించాలి. కొన్ని రాష్ట్రాల్లో తగిన చర్యలు తీసుకుని వారిని ఆదుకున్నా..అవి తక్షణ ఉపశమనం కోసం చేసినవే తప్ప దీర్ఘకాలిక ప్రయోజనాలు ఆశించి చేయలేదు. ఇవన్నీ కళ్లకు కనిపిస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ఆదుకున్న ప్రయత్నాలు చేయడంలేదు. చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదు. దేశ పునర్నిర్మాణంలో అతిపెద్ద భాగస్వాములైన ప్రజలను అనాథలుగా వదిలేస్తే భవిష్యత్ నాశనం కాగలదు. నిజానికి దేశంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలూ ఉపశమన చర్యలు తీసుకుని, సక్రమమైన వైద్యం అందించే ప్రయత్నం చేసివుంటే సమస్యలే ఎదురయ్యేవి కాదు. కనీసం ఇప్పుడైనా కరోనాతో చనిపోయినవారి వెతలపై అందరూ దృష్టి సారించాలి. అలాగే కరోనాతో ఎంతమంది చనిపోయారో కూడా లెక్కలు తీసేందుకు పనికి వస్తుంది. వారి సంక్షేమం కోసం ఏంచేయాలో, ఇప్పుడెదురైన చేదు అనుభవాలు భవిష్యత్తులో ఎదురు కాకూడదనుకుంటే ఎలాంటి చర్యలు చేయడం అవసరమో లోతుగా ఆలోచించాలి. ఉన్న ఊరును, కన్నవారిని విడిచి, భార్యాబిడ్డల్ని వదిలి వేల కిలోమీటర్ల దూరంలో అనేకులు దినసరి కూలీలు పనిచేస్తున్నారు. ఇలా నగరాలకొస్తున్నవారంతా ఎంతటి దుర్భరమైన స్థితిలో బతుకు లీడుస్తున్నారో పరిశీలన చేయాలి. దేశ సంపద పెంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలస జీవుల్ని ప్రభుత్వాలు పూర్తిగా ఉపేక్షిస్తున్నాయి. చెప్పుకోవడానికి పేదరిక నిర్మూలన పథకాలు దేశంలో చాలానే వున్నా.. అవేవీ దినసరి కూలీలను, కార్మికులను ఆదుకోవడలేదని నిరూపితం అయ్యింది. కరోనా దెబ్బతో వలస జీవులకు ఇన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు చేసిందేమీ లేదని వెల్లడైంది. వలస జీవులతో పనులు చేయించుకుంటున్న యజమానుల్లో అత్యధికులు వారికి సంబంధించి ఎలాంటి రికార్డులూ నిర్వహించడం లేదు. కార్మికులకు న్యాయంగా దక్కవలసిన పథకాలను ఎగ్గొట్టడం కోసం చాలా తక్కువ మందిని లెక్కల్లో చూపుతారు. పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగాలు పక్కన పెట్టాయి. కరోనాకన్నా బలమైన మరో వైరస్ రానుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటినుంచే అప్రమత్తం కావాల్సి ఉంది. ఈదశలో ఇక కార్మికులకు ఉపాధి చూపే దిశగా పథకాలు రూపొందించాలి. వారి కుటుంబాలకు బతుకు భయం లేకుండా చూడాలి. అందుకు తగిన ప్రణాళికలను రచించాలి.

## అవినీతిపై ఇడి, సిబిఐలు ఏం చేస్తున్నాయి..?

**మొదటిపేజీ తరువాయి..**

టోల్ స్కామ్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పాత్రదారులు కాగా.. మాజీ సీఎస్ సోమేష్ కుమార్, ఐఏఎస్ అర్వింద్ కుమార్ సూత్ర ధారులన్నారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు టీఓటీ టెండర్లు .కనీస ధర ప్రకటించకుండా పిలిచారని..ఇది నిబంధనలకు విరుద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు. ఓఆర్ఆర్ మాస్టర్ ఎలాన్ అనుసరించి ఏ టెండరు పిలవాలన్నా 2031 లోపే పిలవాలన్నారు. కానీ ఓఆర్ఆర్ టెండరును 30 ఏండ్లకు కట్టబెట్టారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ మొదట్లో కఠిన నిబంధనలతో రూపొందించారని.. అయితే కల్వకుంట్ల కవిత, ఇతర సౌత్ లీడర్ల పాలసీలో మార్పులు చేసి వందల కోట్లు దోచుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. లిక్కర్ పాలసీని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో సీఎం కేజ్రీవాల్కు రూ.100 కోట్ల ముడుపులు ఇచ్చారన్న ఆరోపణలపై ఎమ్మెల్సీ కవిత సీబీఐ విచారణ ఎదుర్కొంటున్నారని చెప్పారు. అయితే ఓఆర్ఆర్ టెండర్ల విషయం లక్ష కోట్లకు సంబంధించినదని.. అంత విలువైన ఆస్తిని కేవలం రూ.7,300 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. దీంతో పోలిస్తే ఢిల్లీ లిక్కర్ స్కాం చాలా చిన్నదని రేవంత్ పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా 30 ఏళ్లకు టెండర్ కట్టబెట్టడంపైనా కేంద్రం స్పందించడం లేదన్నారు. దేశంలో ఎక్కడైనా 15, 20 ఏళ్లకు టెండర్లు పిలుస్తాంటారని..కానీ తెలంగాణ ప్రభుత్వం లక్ష కోట్ల విలువైన ఓఆర్ఆర్ ను 30 ఏళ్ల లీజుకు రాసిచ్చేసిందన్నారు. ఓఆర్ఆర్ టీఓటీ టెండర్ల ఒప్పందం 2023 ఏప్రిల్ 27న చేసుకున్నారని.., టెండర్లు ఆమోదించి మే 26వ తేదీకి 30 రోజులు పూర్తయ్యాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. అయితే రూ.7,300 కోట్లలో 25 శాతం అంటే రూ.1800 కోట్లు ప్రభుత్వానికి సంస్థ చెల్లించాల్సి ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. కానీ ఇప్పటి వరకు ఆ సంస్థ ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఈ 30 రోజుల నిబంధనపై ఐఏఎస్ అర్వింద్ కుమార్ చెబుతారని రేవంత్ నిలదీశారు. ఐఆర్బీ సంస్థ ఇప్పటికే ఒప్పందాన్ని ఉల్లంఘించారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.కానీ ప్రభుత్వం మాత్రం దీనిపై స్పందించడం లేదని..నిబంధనలను ఉల్లంఘించిన సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. టెండరు నిబంధనలు మార్చి ఉంటే ఆ విషయాన్ని అయినా చెప్పాలని నిలదీశారు. అయితే ఇంత బహిరంగంగానే దోపిడీ జరుగుతుంటే బీజేపీ నేతలు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో ఇంత పెద్ద స్కాం జరుగుతుంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని....ఈడీ, సీబీఐ దాడులు ఎందుకు నిర్వహించడంలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం హైకోర్టుకు సెలవులు అయినందున.. తర్వాత పిల్ దాఖలు చేస్తామని ప్రకటించారు.

## నేడు కెసిఆర్‌తో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ భేటీ

**మొదటిపేజీ తరువాయి..**

శనివారం హైదరాబాద్‌కు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రానున్నారు. శనివారం తెలంగాణ సీఎం కేసీఆర్‌తో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సమావేశం కానున్నారు. ఢిల్లీ రాష్ట్రంలోని గ్రూప్-ఏ అధికారుల పోస్టింగ్, బదిలీల కోసం ప్రత్యేకంగా ఓ అథారిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ యత్నిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సీఎం ఇంటి పునర్ నిర్మాణ పనులపై దృష్టి సారించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బంగ్లా పునరుద్ధరణపై విజిలెన్స్ నివేదిక ఎల్‌జి సక్సేనాకు అందింది. 2020వ సంవత్సరం మార్చిలో అప్పటి పీడబ్ల్యూడీ మంత్రి సీఎం ఇంట్లో అదనపు వసతి ఏర్పాట్లను ప్రతిపాదించారు. డ్రాయింగ్ రూమ్, రెండు మీటింగ్ రూమ్‌లు, 24 మంది కెపాసిటీ ఉన్న డైనింగ్ రూమ్ పునర్నిర్మించడం ద్వారా పై అంతస్తును అదనంగా చేర్చారు. ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సమర్పించిన వాస్తవ నివేదిక ప్రకారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసం పునరుద్ధరణకు మొత్తం రూ.52.71 కోట్లు వెచ్చించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. రూ.52.71 కోట్లలో ఇంటి నిర్మాణానికి రూ.33.49 కోట్లు, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి రూ.19.22 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రజాపనుల శాఖ రికార్డులను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. భారతీయ జనతా పార్టీ గత తొమ్మిదేళ్లుగా కేజ్రీవాల్ ప్రతిష్ఠను దిగజార్చడానికి చేసిన అన్ని ప్రయత్నాలలో విఫలమైన తరువాత, ఇప్పుడు ముఖ్యమంత్రి నివాసాన్ని లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరం అని ఆమ్ ఆద్మీ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

ముఖ్యమంత్రి అధికారిక నివాసాన్ని పునరుద్ధరించడంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తడంతో పాటు మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఎల్‌జీ వీకే సక్సేనా సంబంధిత ఫైళ్లన్నింటినీ భద్రపరచి వాస్తవ నివేదికను సమర్పించాల్సిందిగా ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్‌ను ఏప్రిల్‌లో ఆదేశించారు. ప్రత్యేక కార్యదర్శి వైవివిజె రాజశేఖర్ సంతకం చేసిన నివేదికను ఎల్‌జికి సమర్పించారు.


కొవిడ్-19 మహమ్మారి సమయంలో ఆర్థిక శాఖ 2020 ఆర్డర్‌కు వ్యతిరేకంగా నిర్మాణ పనులు చేశారని బీజేపీ ఆరోపించింది.

## పార్లమెంట్ ప్రారంభోత్సవం యధాతథం

**మొదటిపేజీ తరువాయి..**

అంగీకరించలేదు. పైగా...ఇలాంటి పిటిషన్ వేసినందుకు అసహనం వ్యక్తం చేసింది. 'ఇలాంటి పిటిషన్ వేసినందుకు మేమెందుకు మీకు ఫైన్ వేయకూడదు..'? అని వ్యాఖ్యానించింది. విచారణ సమయంలో ధర్మాసనం అసహానానికి గురైంది. ఈ విషయంలో జోక్యం చేసుకోమని తేల్చి చెప్పింది. ఇది సుప్రీంకోర్టు కలగజేసుకోవాల్సిన విషయం కాదని స్పష్టం చేసింది. రాజ్యాంగప్రకారం అధినేత రాష్ట్రపతి అవుతారు. అదే పరిపాలనా పరమైన విషయాల్లోకి వస్తే వాటికి చీఫ్ ప్రధాని మాత్రమే అవుతారు. ఇందులో విచారించాల్సినంత విషయం ఏమీ కనిపించడం లేదు. అందుకే పిటిషన్‌ని తిరస్కరిస్తున్నాం అని సుప్రీంకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల తరవాత పిటిషనర్ తన పిటిషన్‌ని విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. అయితే..సొలిసిటర్ జనరల్ మాత్రం దీనిపై పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇప్పుడు పిటిషన్‌ని విత్‌డ్రా చేసుకుంటే...మళ్లీ హైకోర్టుకి వెళ్తారని అన్నారు. 'హైకోర్టుకి వెళ్లి మళ్లీ ఇదే పిటిషన్ వేస్తారా..?' అని ప్రశ్నించారు. అందుకు పిటిషనర్ 'లేదు' అని సమాధానమిచ్చారు. ఆ తరవాతే పిటిషన్ విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతినిచ్చారు. కొత్త పార్లమెంట్‌ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతికి తగిన గౌరవం కల్పించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతిని ఆహ్వానించకుండా లోక్‌సభ సెక్రటేరియట్ రాజ్యాంగ విలువల్ని కించపరిచారని ఆరోపించారు. లాయర్ జయసుకీన్ ఈ పిటిషన్ వేశారు. ఇప్పటికే 19 పార్టీలు తాము హాజరు కావడం లేదని లేఖ రాశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేత మాత్రమే పార్లమెంట్‌ని ప్రారంభింప చేయించాలని డిమాండ్ చేశాయి. కానీ...బీజేపీ మాత్రం దీనిపై గట్టిగానే వాదిస్తోంది. అనవసరంగా రాజకీయం చేస్తున్నారని మండి పడుతోంది. అసోం ముఖ్యమంత్రి ఈ అంశంపై హిమంత బిశ్వశర్మ మండిపడ్డారు. ప్రతిదీ రాజకీయం చేస్తారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. వరుస ట్వీట్‌లతో ఫైర్ అయ్యారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్నీ బైకాట్ చేస్తారా అని ప్రశ్నించారు.

ఈ ప్రతిపక్షాలన్నీ పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బైకాట్ చేశాయి. రేపు అయోధ్యలోని రామమందిర నిర్మాణ ప్రారంభోత్సవాన్నీ బైకాట్ చేస్తారా..అని అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ ప్రశ్నించారు. ఇదిలా వుంటే భారతదేశ నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పీకర్ ఓం బిర్లాఈనెల 28వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం రెండు దశలుగా ఉండబోతోంది. తొలుత పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఆ కార్యక్రమానికి హాజరైన ప్రముఖు లంతా లోక్‌సభ, రాజ్యసభ ప్రాంగణాలను పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలోని రెండో భాగం రాజ్యసభ ఛాంబర్ లో జాతీయగీతాలాపనతో మధ్యాహ్నం ప్రారంభమవుతుంది. అయితే, అధికారికంగా మాత్రం ఈ వివరాలు ప్రకటించలేదు. పార్లమెంటులోని మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసే పందిరలో సంప్రదాయ పూజలు, హోమంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందులో ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, సీనియర్ మంత్రులు పాల్గొంటారు. పూజాకార్యక్ర మాలు పూర్తికాగానే ఇందులో పాల్గొనే ప్రముఖులతా కలిసి లోక్‌సభ, రాజ్యసభ ప్రాంగణాలను పర్వేక్షిస్తారు. లోక్‌సభ ఛాంబర్‌లో స్పీకర్ కుర్చీ వద్ద పవిత్రమైన రాజదండాన్ని (సెంగాల్) ప్రతిష్ఠిస్తారు. తమిళనాడుకు చెందిన వేదపండితులు, ఒరిజినల్ సెంగాల్‌ను డిజైన్ చేసిన స్వర్ణకారులు పాల్గొని, పూజాదికాలు నిర్వహించిన అనంతరం ఈ రాజదండాన్ని అమర్చనున్నారు. ఉదయం 9.30 గంటల కల్లా తొలి విడత ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తవుతుంది. మధ్యాహ్నం రెండో విడత కార్యక్రమం మొదలవుతుంది. మధ్యాహ్న కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రసంగం ఉంటుంది. రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌కర్ తరఫున అభినందన సందేశాన్ని ఆయన చదివి వినిపిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లిఖితపూర్వక సందేశాన్ని కూడా ఇదే సందర్భంగా సభలో వినిపిస్తారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని 75 రూపాయల నాణెళిన్ని, ఒక స్మారక తపాలా బిళ్లను ప్రధానమంత్రి విడుదల చేస్తారు. కార్యక్రమాన్ని ముగిస్తూ లోక్‌సభ సెక్రటరీ జనరల్ 'ఓట్ ఆఫ్ థాంక్స్' చెబుతారు. పార్లమెంటు భవనం ప్రధాన ఆర్కిటెక్ట్ బిమల్ పటేల్, పారిశ్రామికవేత్త రతన్ టాటా, పలువురు సినీ, క్రీడా ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. 25 రాజకీయ పార్టీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు ప్రకటించాయి. ఎన్డీయే భాగస్వామ్య పార్టీలైన అన్నాడీఎంకే, అప్నాదళ్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, శివసేన షిండే వర్గం, ఎన్‌పీపీ, ఎన్‌పీఎఫ్ పార్టీలు ఇందులో పాలుపంచుకోనున్నాయి.



## అన్ని రంగాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్

**మొదటిపేజీ తరువాయి..**

మిర్యాలగూడలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో హరీష్ రావు పాల్గొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగకుంటే కేంద్రం ఎలా అవార్డులు ఇస్తుందని హరీష్ రావు ప్రశ్నించారు. కేసీఆర్ అద్భుతమైన పాలనతోనే రాష్ట్రానికి అవార్డులు వస్తున్నాయని చెప్పారు. 60 ఏళ్లుగా జరగని అభివృద్ధి కేసీఆర్ ఒక్కరే చేసి



చూపించారని హరీష్ రావు తెలిపారు. ఇప్పటివరకు లక్ష50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్న హరీష్.. ప్రైవేటు రంగంలో 17 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు చేసే అబద్ధాపు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. నల్గొండ జిల్లాలో 13 స్థానాల్లో గూలాబీ జెండానే ఎగురుతుందని, కాంగ్రెస్ కు 40 నుంచి 50 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరని హరీష్ విమర్శించారు. ప్రతిపక్షాలు ప్రజలకు అబద్దాలను ప్రచారం చేస్తున్నాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రతిపక్షాల అబద్దాలకు అభివృద్ధి అనే ఆయుధంతో సమాధానం చెబుతున్నామని వ్యాఖ్యానించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. అభివృద్ధి చేసి చూపిస్తున్నాం కాబట్టే అవార్డులు మన సొంతమయ్యాయని తెలిపారు. కేసీఆర్ పాలనను చేసి యావత్ దేశమే గర్విస్తుందని మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ తప్ప మిగిలిన 9 ఉమ్మడి జిల్లాలు వెనుకబడ్డాయని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు చేసే విష ప్రచారాలకు.. బీఆర్ఎస్ కార్యకర్తలు విషయ పరిజ్ఞానంతో బుద్ధి చెప్పాలని సూచించారు. పదేళ్ల పాలనలో కాంగ్రెస్ ఆరు వేల ఉద్యోగాలు ఇస్తే.. బీఆర్ఎస్ పాలనలో 1.35 లక్షల ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. తెలంగాణలో నిరుద్యోగం లేదని.. కాంగ్రెస్ పార్టీలో పదవుల నిరుద్యోగం ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలన బాగోలేదు కాబట్టే కేసీఆర్‌ను రెండుసార్లు సీఎం కుర్చీలో కూర్చోబెట్టారని అన్నారు. మళ్లీ రాబోయేది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి 40 నుంచి 50 స్థానాల్లో అభ్యర్థులే లేరని అన్నారు.



## జూన్ 22 నుంచి బోనాల ఉత్సవాలు

**మొదటిపేజీ తరువాయి..**

మంత్రి తలసాని చెప్పారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ బేగంపేటలోని హరిత ఎలాజాలో బోనాల ఏర్పాట్లపై మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, మల్లారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మేయర్ విజయలక్ష్మి, డీజీపీ అంజనీ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. జూన్ 22న గోల్కొండలో ఆషాడ బోనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. జులై 9న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు వచ్చే 10న రంగం నిర్వహిస్తామని తెలిపారు. జులై 16న ఓల్డ్ సిటీ బోనాలు, 17న ఉమ్మడి దేవాలయాల ఆధ్వర్యంలో ఊరేగింపు ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలను సీఎం కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించారని చెప్పారు. మన సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించిందన్నారు.

## మరో నాలుగు కలెక్టరేట్ భవనాలు సిద్ధం

### త్వరలోనే ప్రారంభించనున్న సిఎం కెసిఆర్

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది దినోత్సవాలను అత్యంత వైభవోపేతంగా, ఘనంగా జరుపుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఉత్సవాలు తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా, తెలంగాణ ఘన కీర్తి దశదిశలా చాటేలా, ప్రతి హృదయం ఉప్పొంగిపోయేలా పండుగ వాతావరణంలో నిర్వహించాలని సీఎం సూచించారు.



రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుండి 21 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న మరో నాలుగు జిల్లాల కలెక్టరేట్లను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రారంభించనున్నారు. జూన్ 4వ తేదీ ఆదివారం నాడు నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ను, జూన్ 6 మంగళవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరు కార్యాలయాన్ని, జూన్ 9 శుక్రవారం నాడు మంచిర్యాల జిల్లా, జూన్ 12 సోమవారం నాడు గద్వాల జిల్లా సమీకత జిల్లా కలెక్టరు కార్యాలయాన్ని సీఎం ప్రారంభించనున్నారు.

## టీఎస్ పాలిసెట్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి..

మిట్టల్ ఫలితాలను ప్రకటించారు. పరీక్షల్లో 82.17 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. ఎంపీసీ విభాగంలో 85.73 శాతం, ఎంబైపీసీ స్ట్రీమ్‌లో 86.63 శాతం ఉత్తీర్ణతతో అమ్మాయిలు సత్తా చాటారు. ఇక ఎంపీసీ స్ట్రీమ్‌లో 78.61 శాతం మంది, బైపీసీ విభాగంలో 78.62 శాతం మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. ఈనెల 17న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 98,274 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 54,700 మంది అబ్బాయిలు, 43,574 మంది అమ్మాయిలు ఉన్నారు. ఎంపీసీ విభాగంలో 43,001 మంది అబ్బాయిలు, 3,357 మంది బాలికలు అర్హత సాధించగా, బైపీసీ స్ట్రీమ్‌లో.. 43,006 మంది అబ్బాయిలు, 37,746 మంది అమ్మాయిలు ఉత్తీర్ణులయ్యారు. ఌలిసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కాలేజీలు, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, పీవీ నర్సింహారావు తెలంగాణ యూనివర్సిటీల్లో ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్, టెక్నాలజీ కోర్సులు, అగ్రికల్చర్ డిప్లొమా, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. త్వరలో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది.

## నకిలీ విత్తనాల ముఠా పట్టివేత

**మొదటిపేజీ తరువాయి..**

ప్రాణం విలువ అని పేర్కొన్నారు. ఈ చైన్‌ను తెగ్గొట్టాలని, ఎట్టి పరిస్థితుల్లో మూలంలోనే ఈ సమస్యను నరికేయాలని ఎప్పటికప్పుడు సీఎం కేసీఆర్ మా పోలీస్ శాఖను హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే మేము నకిలీ విత్తనదారులపై ఉక్కుపాదం మోపుతున్నాం అని సీపీ స్పష్టం చేశారు.సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యల ఫలితంగానే మన తెలంగాణ రాష్ట్రంలో 80 శాతం నుంచి 90 శాతం వరకు నకిలీ విత్తనాల బెడద తగ్గిందని సీపీ తెలిపారు. ఇంకా అక్కడక్కడా ఈ మాఫియా ఉందన్నారు.

వారినీ ఏరిపారేస్తాం. సీఎం నిత్యం రైతుల పట్ల, వారి క్షేమం పట్ల ఉండే ఆలోచనా దృక్పథంతో, రైతు భద్రతే రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యత దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కానీ, మా పోలీస్ శాఖ కానీ రైతుల రక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా నకిలీ విత్తనాల మాఫియాపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తున్నాం. వ్యవసాయ శాఖ, వ్యవసాయ వర్సిటీతో మా పోలీస్ శాఖ సమన్వయం చేసుకొని ఈ నకిలీ విత్తనాల మాఫియా పట్ల అత్యంత కఠినచర్యలతో ఉక్కుపాదంతో అణచివేస్తాం అని సీపీ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు.



### ఉత్తమ మార్కులు సాధించిన
## విద్యార్థులకు అభినందనలు

**జగిత్యాల మే 26(ప్రజా మంటలు):** శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన ఉపాధ్యాయ శిక్షణ మూడవ సెమిస్టర్ ఫలితాలలో పట్టణానికి చెందిన శ్రీ కాసుగంటి లక్ష్మీనరసింహరావు ( ఎస్ కె ఎల్ఎన్ఆర్ బి.ఈడి కాలేజి ) ఉపాధ్యాయ శిక్షణ విద్యార్థులు ఫలితాల్లో విజయకేతనం ఎగురేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ శిక్షణ కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం విద్యార్థులు ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై వందకి వంద శాతం ఫలితాలు సాధించారని, అనంతరం విద్యార్థులకి కళాశాల తరపున మేమొంటోలు, స్వీట్స్ అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల, కర స్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది విద్యార్థులకి శుభాకాంక్షలు తెలిపారు.

## గడ్డం నందు ప్రధమ వర్ధంతి అన్నదానం

**జనగామ మే 26 (ప్రజామంటలు):** గడ్డం నందు ప్రధమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు గడ్డం లల్లు అమ్మ వాణి రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి



నడిపించిన అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు సల్ల మహేష్, బింగి నరసింహులును జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారులు వంగ భీమ్ రాజు అభినందించారు.

### దుర్గామాత ఆలయానికి
## లక్షరూపాయల చందా

**చిల్పూర్ మే 26 (ప్రజామంటలు):** మండలంలోని కొండాపూర్ గ్రామంలో ని శ్రీ దుర్గామాత ఆలయానికి గాను చందాగా గడ్డి రవి లక్ష



రూపాయలు నగదుగా అందజేసినారు. ఈ కార్యక్రమంలో లొడేం రవీందర్, మారబొయిన ఎల్లయ్య, కొండ తిరుపతి, టిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ప్రకాష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



**పాలీసెట్ 2023 ఫలితాలలో 3749 ర్యాంక్ సాదించిన చందా శ్రీనివాస్-స్వాతి దంపతుల కుమారుడు చందా కార్తిక్‌ను అభినందించిన వాసవి కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పజ్జూరి గోపయ్య, వాసవి క్లబ్ గాలక్సీ జనగామ జోన్ ఛైర్మెన్ గంధె.వేణు అధ్యక్షులు ఐత శ్రీకాంత్,తోడుపూనూరి. ప్రసాద్,బస్సు పాండు, కాసాల సంతోష్ కుమార్ , గంగిశెట్టి మంజు నాద్, తడ కమల్ల నర్సింహా రావు..**

## కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**తరిగొప్పుల మే26 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తున్న సందర్భంగా యంపిడిఓ కార్యాలయం దగ్గర మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసినరు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు భూక్య రాజేందర్, రాష్ట్ర నాయకులు భూక్య లింగం, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఆమనగంటి మహేందర్, మండల కమిటీ ఉపాధ్యక్షుడు మమత, పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, హరిత, నవనీత, మాధవి, కుమార్, రాజు,రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.



# మాజీ సైనికుల సేవలు ప్రభుత్వం వినియోగించుకోవాలి

### కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి

**జనగామ మే 26 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలో ఈనెల 28వ తేదీన ఎన్ఎంఆర్ గార్డెన్స్ లో జరిగే మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి అన్నారు.

శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశంలో 40 లక్షల మాజీ సైనికులు ఉన్నారని,మాజీ సైనికులు వారి సైనిక సేవలను పంచుకోవడం,1962 యుద్ధ అనుభవం, భారతదేశం తరపున సైనికుల సేవలు నెమరువేసుకొనే ఉద్దేశ్యంతో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైనికుల అనుభవం దేశ సేవకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో, విద్యార్థులలో దేశభక్తి పెంపొందించడంలో మాజీ సైనికులు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు.ప్రతి జిల్లాలో సైనికులకు కమ్యూనిటీ సెంటర్, సైనిక్ వెల్ఫేర్ సెంటర్,ఎక్స్ సర్వీస్ మెన్ కార్పొరేషన్ ఏర్పాటు, డిఫెన్స్ కాలనీ కి స్థల కేటాయింపు,డొమిసైల్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. తెలంగాణలో మాజీ సైనికులు సేవలు చేయడానికి అవకాశం ఇవ్వాలని అన్నారు.


ఆదివారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథిగా పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, అతిథులుగా శాసనసభ మండలి డిప్యూటీ చైర్మన్ బండ




ప్రకాశ్,జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, జనగామ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జిల్లా కలెక్టర్ సి.హెచ్. శివలింగయ్య, ఆత్మీయ అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సైనిక బోర్డు డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, జనగామ జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు చిర్ర రవీందర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ చిర్ర రవీందర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి అరవింద చారి,రాష్ట్ర సైనిక్ బోర్డ్ మెంబర్ డి.కరుణాకర్ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, పల్లా జయపాల్ రెడ్డి,వనమాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అకాల మరణం చెందిన "భూ దాత"

### ప్రజల దాహార్తి తీర్చిన "చల్ల పోచమల్లు"
### నేటికీ ఆయన స్థలంలోనే వాటర్ ట్యాంక్ - నీటి సరఫరా





**బుగ్గారం / జగిత్యాల జిల్లా మే 26 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో 1995 – 96 కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం రెండు గుంటల భూమి దానం చేసిన చల్ల పోచమల్లు (85) అనే రైతు గురువారం అకాల మరణం చెందారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా కాలం యందు బుగ్గారం గ్రామంలో ప్రప్రథమంగా త్రాగు నీటి సరఫరా కై వాటర్ ట్యాంక్ కోసం అప్పటి ఎమ్మెల్యే శికారి విశ్వనాథం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించారు. స్థల సేకరణ జరుగగా అనువైన స్థలం లభించకపోవడంతో అప్పటి మాజీ సర్పంచ్ స్వర్గీయ బొడ్డు శంకరయ్య ప్రోత్సాహంతో చల్ల పోచమల్లు అలియాస్ గుమ్మడి పోచమల్లు తన స్వాధీనంలో ఉన్న పుట్టమన్ను బోరు స్థలం స్వచ్ఛందంగా రెండు గుంటల భూమి దానం చేశారు. ఉమ్మడి ధర్మపురి మండల ప్రథమ జడ్పిటిసి బత్తిని అరుణ, ఆనాటి ఎమ్మెల్యే శికారి విశ్వనాథం లు నీటి ట్యాంక్ నిర్మాణం కోసం భూ దానం చేసిన చల్ల పోచమల్లు అలియాస్ గుమ్మడి పోచమల్లు అనే రైతును ప్రత్యేకంగా అభినందించారు.

ప్రశంసల జల్లులు కురిపించారు. మంజూరైన నిధులతో వెను వెంటనే శిలాఫలకం వేసి శంఖుస్థాపన చేశారు. బుగ్గారం నివాసి ఆయిన ప్రముఖ కాంట్రాక్టర్ యొక్క సూపర్వైజర్ జోగినిపెల్లి మురళీధర్ రావు పర్యవేక్షణలో నీటి ట్యాంక్ నిర్మించారు. నేటికీ బుగ్గారం ప్రజలకు అదే వాటర్ ట్యాంక్ ద్వారా త్రాగు నీరు సరఫరా కొనసాగుతోంది.

నేడు సుమారు రూ. 40లక్షల విలువ చేసే భూమిని 1995 – 96 కాలంలోనే బుగ్గారం ప్రజల దాహార్తి కోసం దానం చేసిన చల్ల పోచమల్లు అకాల మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, గ్రామస్థులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు చల్ల పోచమల్లు కు భార్య అమృతమ్మ, ఇద్దరు కుమారులు – కోడల్లు, ముగ్గురు కుమార్తెలు – అల్లుల్లు, 14మంది మనుమలు – మనుమరాండ్లు ఉన్నారు. కాగా గురువారం రాత్రి చల్ల పోచమల్లు అంత్యక్రియలు స్థానిక వైకుంఠ దామంలో నిర్వహించారు. అనేక మంది గ్రామ ప్రముఖులు, బుగ్గారం వాసులు, కుల బాంధవులు, బంధుమిత్రులు చల్ల పోచమల్లు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# బెల్లి లలిత 24వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన యాదవులు

### బెల్లి లలిత యాదవ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ మీద ఎర్పాటు చేయాలని డిమాండ్

**హుస్నాబాద్ మే 26 (ప్రజా మంటలు):** బెల్లి లలిత 24 వ వర్ధంతిని హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్ మరియు అక్కన్నపేట మండలాలలో యాదవ నాయకులు ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా సామాజిక గాయకురాలు విమలక్క హాజరై నివాళులు



అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బెల్లి లలిత ప్రముఖ ఉద్యమ పాటల గాయని అని, తెలంగాణ కళాసమితి వ్యవస్థాపకురాలని ఈమె 'తెలంగాణ గాన కోకిల'గా పేరుగాంచిందని తన పాటల ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్య పరుస్తూ గుట్కా పాన్ వ్యతిరేకంగా ఉద్యమాలు చేసింది పడుపు వృత్తికి వ్యతిరేకంగా పనిచేసింది తెలంగాణ జన సభ ద్వారా తెలంగాణ వాదాన్ని మొదటగా గలమెత్తింది అని తెలిపారు. యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ బెల్లి లలిత యాదవ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ మీద ఎర్పాటు చేయాలని మరియు జీవిత చరిత్ర ను పాట్య పుస్తకం లో చేర్చాలి మరియు భువగిరి జిల్లాకు బెల్లి లలిత పేరు పెట్టాలని మరియు బెల్లి లలిత వర్ధంతి కార్యక్రమం మరియు జయంతి కార్యక్రమం ప్రభుత్వం అధికారికంగా నిర్వించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేడం లింగమూర్తి, యాదవ నాయకులు గొర్ల వీరన్న యాదవ్ ,గొర్ల తిరుపతి,జక్కుల రమేష్ ,పంజా సంపత్ వల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు తపాల శాఖ గుడ్ న్యూస్

### ఇంటి వద్ద, పనిచేసే చోటే వేతనం తీసుకునే చాన్స్

**హనుమకొండ మే 26 (ప్రజామంటలు):** గ్రామీణ ప్రాంతంలో ఉండే ఉపాధి హామీ కూలీలకు బ్యాంకు ఖాతాలు లేకపోవటంతో వేతనాలు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తపాల శాఖ వారి ఇక్కట్లను తొలగించేందుకు నడుంబిగించింది. ఇంటి వద్ద, పనిచేసే చోటనే వేతనాలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు హనుమకొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.నందా తెలిపారు. రాష్టంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వ్యవసాయ కార్యకలాపాలు బాగా తగ్గిపోయి ఉపాధిహామీ పనులకు ప్రాధాన్యత పెరిగిందని, అయితే, ఉపాధి హామీ కూలీలు చేసిన పని వేతనాలు తీసుకునేందుకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారికోసం చక్కటి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో డివిజన్ లో 470 పోస్టాఫీసులు ఉన్నాయని, ఉపాధి హామీ కూలీలకు ఉపయోగపడే సేవింగ్, ఐపిపిబి ఖాతాలు తెరుచుటకు అన్ని పోస్టాఫీసులలో తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఈ పోస్టల్ ఖాతాలు తీసుకుంటే ఇంటి వద్ద, పనిచేసే చోటనే వేతనాలు తీసుకోవచ్చునని, ఈ సౌకర్యాన్ని, అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.



### పాలీసెట్‌లో ప్రతిభ చాటిన
## అక్షర స్కూల్ విద్యార్థులు

**కోరుట్ల టౌన్ మే 27:ప్రజా మంటలు:** 2023విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్రం వెల్లడించిన పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో కోరుట్ల మండలం కల్లూరు గ్రామం లో గల అక్షర హై స్కూల్ విద్యార్థులు ఎక్కల్దేవి వ్యోమకేష్ రాష్ట్ర స్థాయి లో 50వ ర్యాంకు సాధించాడు. అదే పాఠశాలలో చదువుతున్న వేముల భవజ్ఞ 1113ర్యాంక్ సాదించారని పాఠశాల కరస్పాండెంట్ వెంకట సిద్దార్థ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలంటే పోటీ పరీక్షలు ఎంతో దోహద పడుతాయని. ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయులకు మరియు సహకరించిన తల్లి, దండ్రులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ సతీష్ తల్లి దండ్రులు ఉపాధ్యాయ డైరెక్టర్ ప్రియాంక, బృందం పాల్గొన్నారు.





### డ్రంక్ అండ్ డ్రైవ్, కేసులో
## ఆరుగురు వ్యక్తులకు జరిమానా

**హనుమకొండ మే 26, (ప్రజా మంటలు):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ముగ్గురు వాహనదారులకు రూ.3,500, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురు వ్యక్తులకు రూ.7,600/- సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తెలిపారు. ఇటువంటి నేరాలు మున్ముందు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ
## జిల్లా చైర్మన్‌గా డా.లవకుమార్ రెడ్డి

### కార్యదర్శిగా కన్న పరశురాములు

**జనగామ మే 26 (ప్రజామంటలు):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా నూతన కమిటి, కార్యనిర్వహక వర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా సహకార



శాఖాధికారి కిరణ్ కుమార్ ప్రకటన విడుదల చేసారు. 349 మంది సభ్యులు గల జనగామ సొసైటీ ప్రెసిడెంట్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. కాగా ఈ రోజు జరిగిన ఎన్నికలలో చైర్మన్ గా ప్రముఖ వైద్యుడు, ఐ. ఎం. ఏ పూర్వ అధ్యక్షుడు డా. డి. లవకుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ గా స్థానిక వాణిజ్య ప్రముఖులు ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకుడు ఫజ్జూరి గోపయ్య, కార్యదర్శిగా సీనియర్ జర్నలిస్టు సంఘ సేవకుడు కన్న పరశురాములు, కోశాధికారిగా ఉపాధ్యాయ సంఘ నాయకుడు కుర్రేముల యాదగిరి, రాష్ట్ర మేనేజింగ్ కమిటి సభ్యునిగా విశ్రాంత ఉపాధ్యాయుడు మహమ్మద్ గౌస్ మోహియుద్దీన్ ఎన్నికయ్యారు. ఇంకా జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా బానాసి రజినీ, అల్లాడి ప్రభాకర్ రావు, డా. పిట్ట సత్యం, సి. ఉపెందర్ రెడ్డి, గాదె క్యాథరిన్, పేర్వారం ప్రభాకర్, డా. ఎల్. లక్ష్మీ నారాయణ నాయక్, డా. చంద్రగిరి రాజమౌళి, క్రిష్ణ జీవన్ బజాజ్ ఎన్నికయ్యారు. విజేతలను అభినందిస్తూ ఎన్నికల అధికారి ధృవ పత్రాలు ప్రదానం చేసారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

### గుర్తుతెలియని వాహనం
## ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి

**హనుమకొండ మే 26 (ప్రజామంటలు) :** జిల్లా నడికుడ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన తాళ్ళపల్లి విజయ్ కుమార్ (50), గురువారం రాత్రి హనుమకొండ నుండి తన స్వగ్రామానికి పులిగిల్లకు తిరిగి వెళ్తున్న క్రమంలో, వంగపాడు క్రాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని లారీ ఢీ కొట్టడం వల్ల, విజయ్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తలకాయ మొత్తం టైర్ క్రింద నలిగి పోవడంతో ఘటన ప్రాంతం అంతా పరిస్థితి భయానకంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ఇంకెంతకాలమీ తిరోగమన చర్యలు?

నోట్ల రద్దుతో నల్లధనాన్ని అరికడతామని చెప్పిన వారు అసలు ఆర్థిక పతనాన్ని చూపించారు. దాని ఫలితంగా దేశంలో వేలాది చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. ఉన్న పరిశ్రమలను ప్రభుత్వమే పనిగట్టుకుని మూసేస్తోంది. లేదా తుక్కు కింద అమ్మేస్తోంది. దీంతో ఉపాధి,ఉద్యోగ రంగాలపై తీవ్రప్రభావంచూపుతోంది. విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టింది. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ఊసే లేకుండా పోయింది. ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని తుక్కుకింద అమ్మేస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా లక్షలాది మంది నిరుద్యోగులు తయారు అయ్యారు. విచిత్రమేమంటే నోట్ల రద్దు తర్వాతే గతంలో కంటే ఎక్కువగా నల్లధనం చెలామణీ లోకి వచ్చిందని అధికార గణాంకాలే చెబుతున్నాయి. ఈ క్రమంలో మరోమారు రెండువేల నోట్ల రద్దుతో మరింత సంక్షోభం వచ్చేప్రమాదంఉంది. రెండువేల నోట్లను ముద్రించడం..ఇప్పుడు రద్దు చేయడం కూడా ఓ పెద్ద కుంభకోణంగా తయారయ్యింది. ఇంతకాలం 2వేల నోట్లు చెలామణిలో లేకుండా పోవడం వల్ల దేశంలో ఆర్థికస్థితి దిగజారిందని చెప్పాలి. మోడీ గుజరాత్ మోడల్ ప్రచారంతో ఆశగా ఉన్న ప్రజలు రెండు దశాబ్దాల తర్వాత ఒకే పార్టీకి అంటే బిజెపికి స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టారు. మోడీ అధికారంలోకి వస్తే సమస్యలు సమసి పోతాయని భావించారు. అలా అధికారంలోకి వచ్చిన వారు ఈ దేశంలో మౌలిక మార్పు తీసుకువస్తారని అందరూ ఆశించారు. కానీ పేద, మధ్య తరగతి ప్రజానీకం ఇబ్బందులు పడేలా ప్రస్తుత పాలనా విధానాలు ఉన్నాయి. రాష్ట్రాలు బలోపేతం అయితేనే దేశం బలోపేతమవుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితులు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా కనిపిస్తున్నాయి. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు రాజ్యాంగానికి కొత్త భాష్యాలు చెబుతున్నారు. మెజారిటీ వాదాన్ని వినిపిస్తున్నారు. దీన్ని ప్రశ్నించిన వారిపై దేశద్రోహులు అనే ముద్ర వేసి కేసులు పెడుతున్నారు. ప్రజా సంక్షేమం సంక్షోభం లోకి నెట్టబడింది. ఆదేశ సూత్రాల ప్రధాన లక్ష్యం రాజకీయ, ఆర్థిక ప్రజాస్వా మ్యాన్ని నెలకొల్పడం. కానీ నయా పాలకుల విధానాలతో ఇవ్వాళ దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. దాని ఫలితం ఏమిటి అన్నది ప్రజలందరికీ అనుభవంలోకి వచ్చింది. కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. కానీ ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నారు. కుటీర పరిశ్రమల స్థాపన అన్నది నినాదంగానే మిగిలి పోయింది. ఉన్న పరిశ్రమలన్నీ మూతపడుతున్నాయి. అంతిమంగా ప్రజలకు ఉద్యోగ భద్రత కరువైంది. పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు సరైనవి కావని ఆర్థికవేత్తలు పదేపదే హెచ్చరిస్తున్నా పట్టింపు లేకుండా పోయింది. జిఎస్టీతో ఏకీకృత పన్ను విధానం అంటూ ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారు. దీనిపై ఇప్పటికీ సమీక్షలు లేవు. ఉన్నతమైన ప్రజాస్వామిక పరిపాలన దేశానికి



అందించాలనే లక్ష్యానికి ఇటీవలి కాలంలో తూట్లు పొడిచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వ్యవస్థలను దెబ్బతీస్తూ కొందరి ఆకాంక్షల కోసం ప్రజల ఆశలను వమ్ము చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకు అతీంగా లేవు. అంతా కలసి తమవంతుగా ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. ఈ తరహా రాజకీయాలకు సమాధి కట్టాల్సి ఉంది. అప్పుడే ప్రజలు హాయిగా బతకగలరు.రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పనిహక్కు, ఉపాధి హక్కులన్నీ ఉత్తదే అని రుజువయ్యింది. రాజ్యాంగం విఫలమైతే రాజ్యాంగాన్ని నిందించవద్దని, దాన్ని అమలు చేసే వారిని నిందించాలని అంబేడ్కర్ ఆనాడే అన్నారు. రాజ్యాంగం ఆధారంగా ఏర్పాటైన అన్ని ప్రభుత్వ వ్యవస్థల అధికారానికి మూలం ప్రజలే అని ఆయన స్పష్టీకరించారు. కానీ ఆయన ఆశలు వమ్మయ్యాయి. అంబేడ్కర్ దూరదృష్టితో చేసిన ప్రయత్నాలను తుంగలో తొక్కుతున్నారు. ఆయన విగ్రహాలు పెట్టి దండలు వేయడం తప్ప ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకుని వెళ్లడంలో పాలకులు విఫలమయ్యారు. అంబేడ్కర్ ను బాగా పొగుడుతున్న బిజెపికూడా అందరికన్నా ఎక్కువగా అవినీతి కార్యకలాపాలకు పాల్పడడం సిగ్గుచేటు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాల గురించి పేర్కొనే సమాఖ్య స్ఫూర్తి ఆచరణలో విఫలమైంది. ప్రణాళిక సంఘం స్థానంలో తెచ్చిన నీతిఆయోగ్ స్థాపన సమయంలో వల్లించిన ఆదర్శాలు కానరావడం లేదు. ప్రజా ప్రయోజన పథకాలకు తగిన నిధులు కేటాయించాలని చేస్తున్న సిఫార్సులను కేంద్రం పట్టించు కోవడం లేదు. వ్యవస్థలను భ్రష్టుపట్టించి వ్యక్తుల కేంద్రంగానే రాజకీయాలు, ప్రభుత్వ విధానాలు కొనసాగుతుండటం ఆందోళనకరం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశం వందేళ్లు వెనక్కి వెళ్తుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. రాజ్యాంగ లక్ష్యం ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు ప్రతిఫలించడం లేదు. అందరికీ రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు సామాజిక న్యాయం అందించడమే ప్రజాస్వామ్యం. భారత రాజ్యాంగం గొప్పదనం ఏమిటి అంటే అధికారంలో ఉన్నవాళ్లు రాజ్యాంగాన్ని అతిక్రమించడానికి వీలు లేకుండా ప్రాథమిక సూత్రాలను పొందుపరిచారు. ప్రజలను విడిచి పాలనా వ్యవహారాలు సాగిస్తున్నారు. దీంతో దేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడి ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రజాస్వామ్య పరిపాలన, స్వీయ అభివృద్ధి అనే లక్ష్యాలను నిర్దేశించుకొని పాలనా వ్యవస్థను భారతీయ కరణ చేయాలని అంబేద్కర్ భావించారు. దేశ ప్రజలందరికీ సమానమైన విలువ, గౌరవం హక్కులు ఉన్నప్పుడే అది ప్రజాస్వామ్యం అవుతుందని ఆయన ఆశించారు. దీనికి అనుగుణంగానే ఆ మహాను భావుడు రాజ్యాంగాన్ని రూపొందించారు. నాటి నుంచి రాజ్యాంగంలో అనేక సవరణలు జరిగాయి. ప్రజల సంక్షేమమే ప్రాధాన్యంగా కొన్ని సవరణలు జరిగాయి. అందరికీ ఉచిత నిర్బంధ విద్య,ఉపాధిహామీ, ఆహార భద్రత, అణగారిన వర్గాలకు హక్కులు, మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం వంటివి ఇందులో కీలక మైనవి. ఇకపోతే సంకీర్ణ ప్రభుత్వాల వల్ల అభివృద్ధి కుంటుపడుతున్నదనే అభిప్రాయం ఎలా ఉన్నా ఏకపార్టీ పాలనలో కూడా అభివృద్ధి నామామాత్రమే అని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం నిరూపించింది. మాటలు తప్ప చేతల్లో అభివృద్ధి కానరావడం లేదు. కరోనా తరవాత సామాన్య ప్రజల బతుకుల మాత్రం నేటికీ కోలుకోవడం లేదు. డబుల్ ఇంజన్ గ్రోత్ అంటూ ప్రచారార్భాటాలు తప్ప ఫలితాలు కాన రావడం లేదు.

---




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్

## నేటి బాలలే రేపటి పౌరులు

కళింగ రాజ్యంలో చంద్రాంగదుడు అనే రాజు పాలించుండెను. ఆ రాజు కుమారుడు యువరాజు అయిన వీరసేనుడు. అతడు విద్యార్థి దశలో ఉన్నాడు. అనేక బల, అతి బల విధ్యలు నేర్చుకున్నాడు. అతడు రోజు అడవికి జంతువులను వేటాడ్డానికి వెళ్తుండేవాడు. ఒక రోజు అడవిలో కొలను దగ్గర నీళ్లు తాగే శబ్దం విని జంతువు అనుకుని బాణం వేశాడు. తరువాత అక్కడికి వెళ్లి చూసేసరికి అతనికి కళ్ళు అబ్బురపడ్డాయి. అక్కడ చూడగా ఒక ముని కుమారునికి బాణం



తగిలింది. ఆ బాలుడు పడిపోయి ఉన్నాడు.

వెంటనే వీరశేనుడు ఏమి చేయాలో తోచక రారాజు అయిన తన తండ్రి చంద్రాంగుడు దగ్గరకు వెళ్లి చెప్పాడు. అప్పుడు రాజు, రాణి,యువరాజు బటులతో కలిసి అడవిలో కొలను దగ్గరకు వెళ్లి చూశారు. అక్కడ బాలుడు లేడు. బటులు చుట్టూ ప్రక్కల వెతికారు. దగ్గర్లో ఒక గురుకుల పాఠశాల ఉంది అని రాజుకు చెప్పారు.

అప్పుడు రాజుగారు అంతా కలిసి ఆ గురుకులానికి వెళ్లారు. అక్కడ గురువుగారికి రాజు ఇక్కడ కొలను దగ్గర బాలుడికి బాణం తగిలి పడిపోయాడు. ఆ బాణం మా యువరాజు వేశాడు. ఇప్పుడు చూస్తే ఆ బాలుడు అక్కడ లేడు అని నిజాయితీగా, ధర్మబద్ధంగా రారాజు అడిగారు. గురువుగారు రాజు గారి ఔన్నత్యానికి మెచ్చుకొని నమస్కరించి ఇలా చెప్పారు.

ఆ బాలుడు మా గురుకులం విద్యార్థి. ఇదిగో వీడే బ్రతికే ఉన్నాడు చూడండి అని అన్నాడు. అప్పుడు యువరాజు ఈ బాలుడే అని రాజుకి చూపిస్తూ అన్నాడు. రాజుగారు ఆశ్చర్యంగా చూశారు. మా విద్యార్థులు క్రమశిక్షణ వాళ్ళకి శ్రీరామరక్ష అని గురువుగారు అన్నారు. గురువుగారు చెప్పిన క్రమశిక్షణ పాఠాలు రారాజు అచ్చు వేయించి నేటి తరానికి అందించారు అది ఏమిటంటే!!

ఓ! విద్యార్థులారా! మీకు చిన్న వయసులో తల్లి , తండ్రి , గురువు హితం చెబుతారు. వయసుకు వచ్చిన తరువాత మంచి వ్యక్తుల మధ్య ఉండాలి.ఆ నాడు రాముడు లాంటి మంచి మనుషులు దగ్గర రావణాసురుడు వంటి చెడ్డ వ్యక్తులు ఉన్నారు.ఇప్పుడు కూడా అంతే. ఆ నాడు సీత, సావిత్రి, మండోదరి, అహల్య వంటి పతివ్రతలు ఉన్నా, కైకేయి మందర సూర్పనఖ లాంటి చెడ్డవారు ఉన్నారు. ఇప్పుడు కూడా అంతే విద్యార్థుల్లారా !!!...మీరు మంచి వ్యక్తులతో స్నేహం చేయాలి. అనేక మంది యోధులు పుస్తకాలు చదవండి. క్రమశిక్షణ పాటించాలి.

1. ఉదయాన్నే ఐదు గంటలలోపు లేచి వ్యాయామం చేయాలి.
2. మనసుని నియబద్ధంగా ఉండడానికి యోగ చేయండి.
3. మంచి ఆలోచన శక్తి పెరగడానికి మంచి పుస్తకాలు చదవండి.
4. బద్ధకం వినండి. రేపు చూద్దాం చదువుదాం అన్నది , ఈ రోజే చేయాలి,చదవాలి అన్నట్లు ఉండాలి.
5. పెద్దల నుండి మంచి మాటలు నేర్చుకోవాలి.
6. సత్యం పలకాలి.అబద్దాలు ఆడకూడదు. ఒక అబద్ధం ఆడితే 100 అబద్ధాలు ఆడవలసి ఉంటుంది.
7. బ్రహ్మచర్యం, విద్యార్థి దశలో చదువుకే ప్రాధాన్యత ఇవ్వాలి. టెక్నాలజీ, సోషల్ మీడియాకు అలవాటు పడకూడదు.

ఈ ఏడు క్రమశిక్షణ సూత్రాలు పాటిస్తే మీ భవిష్యత్తు బంగారు బాటవుతుంది. ఈ సూత్రాలు పాటించడం వలన గురుకులం విద్యార్థులకు బాణం తగిలిన ప్రాణం పోలేదు.

నేటి తరం విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి. నేను చదవలేను నావల్ల కాదు, నాకు ర్యాంకులు రావు అని బద్ధకం పడి, టీవీలకు మరియు సెల్ కి అంకితం అవుతున్నారు. టెన్షన్ కి గురవుతున్నారు. ఆత్మహత్యల పాలవుతున్నారు. ఓ భారత్ మాత ముద్దుబిడ్డల్లారా !!!ఈ నాటి ప్రభుత్వం మీ బంగారు భవిష్యత్ కోసం ఎన్నో, ఎన్నెన్నో పదకాలు ఇస్తుంది. దానిని అందుకని మీ చదువుని సద్వినియోగం చేసుకొని గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యం స్థాపించండి. నేటి విద్యార్థులే రేపటి గాంధీజీలుగా మారండి. భారతదేశం మన మాతఅభూమి భారతదేశాన్ని మహోన్నత దేశముగా తీర్చిదిద్దండి."నేటి విద్యార్థులే రేపటి భారతదేశం", అని గురువుగారు బోధించారు.

–బల్ల కృష్ణ వేణి, పలాస, శ్రీకాకుళం.

---

# "నవభారత నిర్మాత పండిత నెహ్రూ"

### మే 27.... చాచా నెహ్రూ వర్ధంతి

హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు



చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభుత్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు, జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ – గాంధీ కుటుంబ అ మూలపురుషుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబంలో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, "ఆనంద భవన్" లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనా సక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హారో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్లి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నెర్ టెంపుల్ వెళ్లి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు. మొదట మోతిలాల్ నెహ్రూ కుమారుని నిర్ణయాన్ని వ్యతిరేకించినా, తర్వాత ఆయన సైతం సంగ్రామంలో భాగస్వామి అయినాడు. అనంతరం మహాత్ముని నమ్మిన బంటుగా నెహ్రూ గుర్తింపు పొందాడు. ఆ సమయంలో 9 ఏళ్ళు జీవితం అనుభవించాడు. జీవితం సమయంలోనే 1334 లో "గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 1936 లో తన జీవిత చరిత్ర 1946లో "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" రచనలు పూర్తిచేశాడు తొలిసారిగా గాంధీ నాయకత్వ పోరాటంలో, 1929 లో భారత జాతీయ కాంగ్రెస్ నేతగా, లాహోర్ సమావేశాలకు నాయకత్వం వహించాడు. 1936,1937,1940 లలో, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. యువకునిగా ఉన్న నాటి నుండే జాతీయ కాంగ్రెస్ లో, వామపక్ష భావజాల ప్రభావితుడై, సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జన ఆసక్తుడై, గాంధీ సలహాలతో, ప్రజాకర్షణ గల నేతగా, సంస్కరణవాదిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక నిర్వహించి గాంధీ అనంతరం, రెండవ అగ్రశ్రేణి నాయకుడిగా గుర్తించబడి నాడు.1916లో కాశ్మీరీ బ్రాహ్మణ వంశస్థులు రాలైన కమలా కౌల్ తో వివాహితుడైన నాడు. ఫలితంగా కుమార్తె ఇందిరా ప్రియదర్శిని 19 17 నవంబర్ 19న జన్మించింది. కమలా నెహ్రూ 19 46 లో క్షయ వ్యాధితో మృతి చెందగా, కుమార్తె ఇందిర, సోదరి విజయలక్ష్మిలపై, ఎక్కువగా ఆధార పడడం జరిగింది. 1947 నుండి 64 వరకు దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు లో ప్రధాన పాత్ర పోషించి, 1952 లో దేశ తొలి ప్రధాని గా ఎన్నుకొనబడినాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర్య భారత పతాకాన్ని ఎగరవేసిన తొలి భారతీయుడిగా, గౌరవం దక్కించుకున్న ఘనత ఆయనది. పార్లమెంటరీ తరహాలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛావాదం, పేద అణగారిన వారి పట్ల అనురాగం, ప్రధానిగా ఆయన రూపొందించిన విధానాలపై ప్రభావం చూపాయి.1964 మే 27న తన 74వ ఏట పరమ పదించాడు. పంచశీల సూత్ర అనువర్తిగా, అలీనోద్యమ స్థాపకులలో ఒకరిగా, యుద్ధానంతర కాల అంతర్జాతీయ ప్రముఖుడిగా, గౌరవసూచకంగా "పండిట్"గా పిలువబడిన నెహ్రూ, సుదీర్ఘ పదవీకాలం అనుభవాన్ని రంగరింప చేసుకున్న కూతురు ఇందిర, మనమడు రాజీవ్, ప్రధాని పదవులు పొందడానికి స్ఫూర్తి పొందారనడంలో, రవంతైనా అతిశయోక్తి లేదు.




–ఆర్కె సంగనభట్ల
9440595494

---

# మనం - మన చట్టాలు...

### పుస్తక సమీక్ష

వర్తమాన కాలంలో అధిక జనాభా మూలంగా కొంత అభివృద్ధి మూలంగా కొంత మరియు మనుషుల్లో మానవతా విలువలు కొరవడటం కారణంగా సమాజంలో అన్నీ కోణాల నుండి అమితమైన సంఘర్షణలు సమస్యలు సంభవించడం మనందరం చూస్తున్నదే. సామాజికంగా.. కుటుంబపరంగా.. ముఖ్యంగా మనుషుల మధ్య స్నేహ భావం అంతరించి ఎన్నో సమస్యలు ఎదురు అవుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో న్యాయం గురించి చట్టాల గురించి కనీస అవగాహన ఉండటం అత్యంత ఆవశ్యకం. అందుకు చక్కని చేతి పుస్తకంలా శ్రీ జీ.గంగాధర్ అడ్వకేట్ గారు సంకలన పరచిన "మనం – మన చట్టాలు"అనే శీర్షిక గల పుస్తకం అన్ని వర్గాల వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది అనుటలో సందేహం లేదు.గతంలో ప్రజా మంటలు జాతీయ దిన పత్రికలో "న్యాయ వేదిక" శీర్షిక ద్వారా పాఠకుల ప్రశ్నలకు ఇచ్చిన వివిధ సమాధానాలు ఇందులో రచయిత పొందుపరిచారు. ఇంకా తెలంగాణ రెవెన్యూ మాస పత్రికలో రచయిత రాసిన వివిధ వ్యాసాలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. రచయిత జీ.గంగాధర్ గారు స్వయంగా న్యాయవాదిగా గడించిన అనుభవం మరోపక్క రిజిస్ట్రేషన్ శాఖతో తనకున్న అవగాహనతో క్రోడీకరించి ఈ సంకలన పుస్తకం వెలువరించారు. ఈ పుస్తకం ఆసాంతం చదివిన వారికి రచయిత ఎంతటి అనుభవ ప్రావీణ్యాన్ని సంపాదించిన వారోవర్థం అవుతుంది . ఇంతటి అనుభవాన్ని సులభ శైలిలో సామాన్య పాఠక లోకానికి అంద చేసి అవగాహన కల్పించి చైతన్యం కలిగించాలని రచయిత ఆశించడం లో తప్పు లేదనిపిస్తుంది. ఆ సంకల్పం అభినందన అర్హమైనది. ఇందులో రిజిస్ట్రేషన్ దస్తావేజులు,పెళ్ళిళ్ళు.. విడాకులు, కోర్టు తీర్పులు,గ్రామ పంచాయితీ.. పట్టణ ఆస్తుల సమస్యలు మరియు రెవెన్యూ సమస్యల గురించి సందేహ నివృత్తి గల అంశాలు ఎన్నో ఉన్నాయి. నిత్య జీవితంలో ప్రత్యక్షంగా పరోక్షంగా నిత్యం ఎదురు పడే సందర్భంలో ఈ పుస్తకం మనకు రెడీ రిఫరెన్స్‌గా ఉపయోగ పడి ఏ వకీలు దగ్గరకు పరుగెత్తి ఆందోళన పడే అవసరం రాకుండా ఆర్థిక పరంగా కూడా మనను రక్షించే విధంగా ఉంటుందీ పుస్తకం. ఈ పుస్తకం అమెజాన్.. flipkart ద్వారా లభ్యం అవుతుంది. వెల రెండు వందల తొంబై రూపాయలు ఉంది. ఇది కొంచెం భారంగానే ఉంటుంది. రచయితను సంప్రదిస్తే ప్రింట్ ఆన్ డిమాండ్ పద్ధతిలో రెండు వందల రూపాయలకే లభించే అవకాశం ఉంది.




కస్తూరి విజయం హైదరాబాదు వారు ప్రచురణ కర్తలు. రచయిత మొబైల్ నంబర్ +91 9346611516. ఆసక్తి గల వారు తప్పక పొందండి.

---

# పెరిగిన నిరుద్యోగం!

దేశంలో నిరుద్యోగం పెరుగుదల రేటు ఈ సంవత్సరం మొదలైనప్పటి నుంచి ప్రతి నెలా పైకి ఎగబాకుతున్నదే గాని దిగుముఖం పట్టడం లేదు. అలా పెరిగి పెరిగి ఏప్రిల్ నాటికి 8.11 శాతానికి చేరుకొన్నదని ఇది చాలా ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవైపు దేశంలో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. మరోవైపు నిరుద్యోగం ఇంతగా పైకి చేరుకోడంలోని వైరుధ్యం స్పష్టమే. గ్రామీణ భారతంలో ఒక్క ఏప్రిల్‌లోనే 20.3 మిలియన్ల మంది పనుల్లో చేరారని, అక్కడి కార్మిక భాగస్వామ్యం 2.7 పర్సంటేజ్ పాయింట్లు ఎక్కువై ఏప్రిల్‌లో 43.64 శాతానికి చేరుకొన్నదని, పర్యవసానంగా పల్లె భారతంలో 32 కోట్ల 12 లక్షల మంది ఉద్యోగులయ్యారని చెబుతున్న నిపుణులు పట్టణ ప్రాంతంలో నిరుద్యోగం మరింతగా పెరిగి దాని రేటు 9.5 శాతానికి చేరుకొన్నదని వెల్లడించారు.




గ్రామీణ ప్రాంతాల్లో దొరికే పనులు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు చెందినవే. వ్యవసాయాధార పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా నెలకొని గ్రామీణ యువతకు, మహిళలకు మెరుగైన ఉద్యోగాలు కల్పించాయని అనుకోడానికి ఎంత మాత్రం వీల్లేదు. అందుచేత వ్యవసాయ రంగంలో కలిగిన ఉద్యోగావకాశాలు గ్రామీణ జనానికి జీవన భద్రతను ఇవ్వగలవని భావించలేము. అవి వాన రాకడ మీద, సాగు యంత్రాల వినియోగంపైనా ఆధారపడి వుంటాయి. వర్షాలు సరిపడా కురియకపోతే ఈ ఉద్యోగాలన్నీ గాలికి పేలపిండిలా ఎగిరిపోతాయి. అందుచేత గ్రామీణ ప్రాంతాల్లో లభించే ఉద్యోగ, ఉపాధి శాశ్వతమైనవి కావని గ్రహించవలసి వుంది. పని చేసి తమ కాళ్ళ మీద తాము నిలబడాలని కోరుకొంటున్నప్పటికీ అది నెరవేరని పరిస్థితులుండడమే నిరుద్యోగం. ఇటువంటి నిరుద్యోగులు దేశంలో గుట్టలు గుట్టలుగా వున్నారు.

వయసు మీరిపోతున్నా తాము చదువుకొన్న చదువులకు తగిన ఉద్యోగావకాశాలు లభించక నిరుద్యోగులు నిరాశకు గురి అవుతున్నారు. వారిలో ఆశ చావకుండా చేయడానికి ప్రభుత్వాలే ఉద్యోగ అర్హత వయసును తరచూ పెంచుతున్నాయి. జనాభా అమితంగా వుండడం, అదే సమయంలో నాణ్యమైన విద్య కొరవడడం, అధిక శాతం ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడడం, వ్యవసాయ రంగంలో దిగుబడులు, ఉత్పాదకత ఎక్కువగా వుండకపోడం, వ్యవసాయ కార్మికులకు, నైపుణ్యం లేని గ్రామీణ యువతకు ప్రత్యామ్నాయ అవకాశాలు లేకపోడం నిరుద్యోగం అమితంగా వుండడానికి కారణమని బోధపడుతున్నది. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ళ లోపువారే. ఇంతగా యువ జనాభా వున్నప్పటికీ వారిని విద్యావంతులను చేయడం, ఉద్యోగాలు కల్పించడం అనేది అతి పెద్ద సమస్యగా మారింది.

తయారీ రంగంలో ఉద్యోగావకాశాలు పడిపోతున్నాయి. కేవలం సేవల రంగంలోనే అవకాశాలు లభిస్తున్నాయి. ఈ రంగంలో ఉద్యోగాలు వ్యవసాయేతర రంగంలో గల ఉద్యోగాల్లో 90 శాతానికి చేరుకొన్నాయి. పట్టణ ప్రాంతాల్లో లభిస్తున్న చిన్నచితకా ఉద్యోగాలకు భద్రత కరవవుతున్నది. కేంద్రం అనుసరిస్తున్న అనేక విధానాలు ఉద్యోగాలపై, ఉపాధులపై వ్యతిరేక ప్రభావం చూపుతున్నాయి. ఉదాహరణకు పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అవకతవక అమలు చిన్న, చిన్న వ్యాపారాలను తీవ్రంగా దెబ్బ తీశాయి. వాటిలో పని చేసి పొట్ట గడుపుకొంటూ వచ్చిన యువత ఉన్నపళంగా నిరుద్యోగులయ్యారు. అలాగే, కొవిడ్ కాలంలో చాలా మంది కోల్పోయిన ఉద్యోగాలు వారికి తిరిగి లభించలేదు.

ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ళ క్రితం తాను అధికారంలోకి రావడానికి ముందు ఎన్నికల ప్రసంగాల్లో తమకు పగ్గాలు అప్పజెపితే ఏటా 2 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తానని మహా వాగ్దానం చేశారు. అది ఎంత వరకు ఆచరణలోకి వచ్చిందో వివరించి చెప్పనక్కర లేదు. ఆయన ఆధీనంలోని కేంద్ర ప్రభుత్వంలోనే లక్షలాది ఉద్యోగ ఖాళీలున్నాయని సమాచారం. ఆయన మాత్రం కుంటుతూ, కునుకుతూ కొద్ది వేల చిన్న ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇస్తున్నట్లు ప్రచా రం చేయించుకొంటారు. దేశాధినేతలే నిరుద్యోగులతో ఇలా పరిహాసం చిత్తగిస్తున్న చోట కొత్త ఉద్యోగాలు ఎలా లభిస్తాయి? సర్వం కార్పొరేట్లకు అప్పగిస్తున్న బిజెపి హయాంలో ప్రభుత్వ రంగం దారుణంగా కుదించుకుపోతున్నది. ప్రభుత్వోద్యోగాల కోసం ఎవరూ ఎదురు చూడలేని పరిస్థితి నెలకొన్నది.

ప్రభుత్వం తనంతతానుగా రిజర్వేషన్లను రద్దు చేయనవసరం లేకుండా ప్రైవేటైజేషన్ ద్వారా వాటికి తలకొరివి పెడుతున్నది. దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య భవిష్యత్తులో అనేక సంక్షోభాలకు దారి తీసే ప్రమాదమున్నది. తయారీ రంగాన్ని గరిష్ఠ స్థాయికి అభివృద్ధి చేయకపోతే పెను ముప్పు తప్పదు. వ్యవసాయాధార స్థితిని తొలగించి ప్రజలను పరిశ్రమలు, వ్యాపార రంగాల వైపు తరలించడమనేది సునాయాసం కాదు.

# ధాన్యాగారంగా తెలంగాణ అభివృద్ధి

**వరిధాన్యం కొనుగోళ్లే ఇందుకు నిదర్శనం**

**ప్రోత్సాహకాలతో పెరుగుతున్న పంటల దిగుబడి**



**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** తెలంగాణలో ఇప్పుడు వ్యవసాయి కంగా బాగా పురోగమించిందనే చెప్పాలి. ధాన్యం రాశులే దీనికి నిదర్శనం. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్న దృశ్యాలు చూస్తుంటే ఎంతగా ధాన్యం దిగుబడి అయ్యిందో గమనించాలి. ఓ వైపు జోరుగా కొనుగోళ్లు జరుగుతున్నా మరోవైపు తమ ధాన్యం కొనడం లేదని రైతులు ఆందోళనలకు దిగితున్నారు. ఇదంతా ఓ వైపు గోదావరి ఉరుకులు పరుగులు....సాగుతో జిల్లాల్లో ధాన్యం దిగుబడులు పెరిగాయి. మరోవైపు ధాన్యం దిగుబడిలో ఇప్పటికే అగ్రస్థానంలో నిలిచిందన్న కేంద్రం ప్రశంసలతో తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవం సాధించిన ఘనత సిఎం కెసిఆర్‌కు దక్కనుంది. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనడం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ దశలో వ్యవసాయంలో మరో విప్లవాత్మక మార్పునకు తెలంగాణ సర్కారు దృఢ నిశ్చయంతో ఉన్నది. కృష్ణా, గోదావరి, మూసీ నదీ జలాలు పుష్కలంగా లభిస్తున్న తరుణంలో పంట మార్పిడి దిశగా నియంత్రిత సాగు విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నది. గిరాకీ ఉన్న పంటల్నే పండించడం, డిమాండ్ ఉన్నప్పుడే పంటను మార్కెట్‌కు తేవడం.. నియంత్రిత వ్యవసాయం లక్ష్యం. వ్యవసాయానికి పెట్టుబడి సాయం మొదలు విత్తనాల్లో సబ్సిడీ, ఎరువుల్లో రాయితీ సమకూర్చుతున్న ప్రభుత్వం... రైతులు మూస విధానం వీడి మంచి ఆదాయం పొందేలా మేధోమధనం జరిపింది. ఈ మేరకు జిల్లా నేలలకు అనువైన పంటలు వేసి లాభాలు గడించేలా ప్రణాళిక రూపొందించింది. ఒకే రకమైన పంటలసాగుతో ధరలు తగ్గి రైతులు నష్ట పోతున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న పంటలకు రైతులు కూడా మొగ్గుచూపుతున్నారు. వరిదిగుబడి, ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిం దని భారత ఆహార సంస్థ గతేడాది చేసిన ప్రకటన తెలంగాణ వ్యవసాయరంగం పురోగమిస్తోందనడానికి సంకేతం. ఇక అవసరమున్న పంటలను పండించాలన్న లక్ష్యంతో

తెలంగాణ వ్యయసాయ రంగం బహుముఖంగా అభివృద్ధి చెందనుంది. కరోనా కాలం కష్ట సమయంలో ధాన్యా గారంగా,యావద్దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. ఈ విజయం వ్యవసాయరంగ పురోభివృద్ధిలో సాధించిన మైలురాయిగా చూడాలి. కరువులు, వలసలతో కొండంత కష్టాలతో కుమిలిపోయిన అన్నదాతల జీవితాలు గట్టెక్కుతున్నాయి. రైతుబంధుతో పెట్టుబడి సాయంతో పాటు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరాతో వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులకు కెసిఆర్ శ్రీకారం చుట్టారు. కరోనా సంక్షోభంలో అన్నదాత ఆగం కావొద్దని ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలుచేసేందుకు ఊరూరా కొనుగోళ్లను ప్రారంభించారు. యాసంగి దిగుబడిలో మునుపెన్నడూ ఎరుగని రీతిలో వరి దిగుబడి సాధించి తెలంగాణ రైతులు రికార్డు సృష్టించారు. ఆ తరువాత పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనడంతో అన్నదాతలకు భరోసా దక్కింది. దేశచరిత్రలో ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వమూ సాహసించని రీతిలో తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన యాసంగి ధాన్యం విలువ పదివేల కోట్ల రూపాయల పై మాటే అని తెలుస్తోంది. యాసంగిలో పండిన వరిధాన్యం సేకరణలో జాతీయస్థాయిలో తెలంగాణది కీలక భాగస్వామ్యమని ఎఫ్‌సిఐ పేర్కొన్నది.



## శ్రీకృష్ణ జన్మభూమి వివాదం కేసు

**అలహాబాద్ హైకోర్టుకు బదిలీ**

**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** ఉత్తర ప్రదేశ్‌లోని మధురలో ఉన్న శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై కేసు అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయింది. ప్రస్తుతం ఈ కేసు మధుర జిల్లా కోర్టు విచారణలో ఉంది. హిందూ పక్షం కోరిన మీదట హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. మే 3న హైకోర్టు ఈ తీర్పును రిజర్వు చేసి, శుక్రవారం ప్రకటించింది. శ్రీకృష్ణ జన్మభూమి స్థలంలో షాహీ మసీదు ఈద్గా ఉంది. దీనిపై సర్వ హక్కులు తమకే ఉన్నాయని హిందూ పక్షం వాదించింది. ఈ కేసుకు జాతీయ స్థాయి ప్రాధాన్యం ఉందని, అందువల్ల దీనిపై విచారణ హైకోర్టులోనే జరగాలని తెలిపింది. భగవాన్ శ్రీకృష్ణ విరాజ్‌మాన్ తరపున రంజనా అగ్నిహోత్రి, మరో ఏడుగురు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ కేసులో ప్రతివాదులు... షాహీ మసీదు ఈద్గా నిర్వహణ కమిటీ, శ్రీకృష్ణ జన్మభూమి ట్రస్ట్, కాట్ర కేశవ్ దేవ్, శ్రీకృష్ణ జన్మస్థాన్ సేవా సంస్థాన్. శ్రీకృష్ణ దేవాలయానికి పక్కనే ఉన్న ఈద్గాపై హిందువులకే హక్కులు ఉన్నాయని పిటిషనర్లు వాదించారు. హిందూ దేవాలయాలను కూలగొట్టి, ఈద్గాను నిర్మించారని తెలిపారు. ఇటువంటి నిర్మాణం మసీదు కాబోదని, విధ్వంసం చేసి, మసీదును నిర్మించడం వక్ఫ్ కాబోదని తెలిపారు. ఈ భూమిని మసీదు నిర్మాణం కోసం ఎవరూ ఇవ్వలేదని తెలిపారు.

## రాష్ట్రం నుంచి పారాబాయిల్డ్ రైస్ సేకరణ


**మరో 6.80 లక్షల మెట్రిక్ టన్నులకు ఆమోదం**

**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** తెలంగాణ రైతులకు కేంద్రం మరోసారి మద్దతుగా నిలిచింది. 2021-22 రబీ సీజన్, 2022 -23 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 13.73 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ రైస్ సేకరణకు కేంద్రం ఇటీవలే ఆమోదం తెలిపింది. తాజాగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి మరో 6.80 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ రైస్ సేకరిస్తామని వెల్లడించింది. తెలంగాణ రైతులకు మద్దతునందిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇటీవల కురిసిన అకాల వర్షాల మూలంగా నష్టపోయిన రైతులకు కొంత ఊరటనిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ నిరంతర సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ యుద్ధప్రాతిపదికన రైతుల నుండి ధాన్యాన్ని సేకరించి, త్వరగా మిల్లింగ్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇచ్చిన గడువు లోపు ఈఅఎ కు బియ్యాన్ని అందజేయటానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పారాబాయిల్డ్ రైస్ సేకరణ కోసం గత నెల్లో కేంద్రమంత్రి ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు లేఖ రాసినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ నుంచి 15 లక్షల మెట్రికల్ టన్నుల పారాబాయిల్డ్ రైస్ కొనుగోలు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు.

## దేశంలో ఈయేడు సాధారణ వర్షపాతం

**జూన్ 4న కేరళలో నైరుతి ప్రవేశం: ఐఎండి**

**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** దేశంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 1వ తేదీ కంటే ముందు దేశంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశాలు తక్కువని చెప్పింది. జూన్ 4వ తేదీ నాటికి కేరళలోకి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయని అంచనా వేసింది. ఈ ఏడాది దేశంలో సాధారణ వర్షపాతంలో 96 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, రుతుపవనాలు సాధారణంగా కంటే 92 శాతం తక్కువగా రావడంతో వాయవ్య ప్రాంతంలో వర్షాలు కొద్దిగా తక్కువగా ఉంటాయని అంచనా వేసింది. రాబోయే రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు ముందుగు సాగేందుకు అనుకూల పరిస్థితి ఉందని తెలిపింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో జూన్ నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. ముఖ్యంగా దక్షిణ ద్వీపకల్ప భారతదేశం, ఈశాన్య ప్రాంతాలు, నార్త్ ఇండియాలోని ఐసొలేటెడ్ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంటుంది‘ అని ఐఎండీ ఎన్విరాన్‌మెంట్ మానిటరింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్‌సీ) చీఫ్ డి.శివానంద పాయ్ తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఈ ఏడాది ఎల్‌నినో ఏర్పడినప్పటికీ నైరుతి రుతుపవనాల్లో సాధారణ వర్షపాతం ఉంటుందని చెప్పారు.



## అవినాశ్ రెడ్డి బెయిల్‌పై వాదనలు

**నేడు సిబిఐ వాదనలు విననున్న హైకోర్టు**

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. అవినాశ్‌రెడ్డి తరపు న్యాయవాది వాదనలు ముగిశాయి. అవినాష్ రెడ్డి తరపు న్యాయవాది ఉమామహేశ్వర్ రావు ఐదున్నర గంటల పాటు వాదనలు వినిపించారు. సునీతా రెడ్డి ఇంప్లీడ్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగు తున్నాయి. సునీతా తరపు లాయర్ రవిచంద్ వాదనలు వినిపించారు. రేపు సీబీఐ వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది. వివేకా గుండె పోటుతో చనిపోయాడని చెప్పారని, రక్తపు వాంతులతో మృతి చెందినట్లు చెప్పారని, హత్య జరిగితే.. గుండె పోటు అని ఎలా చెపుతారని సునీతారెడ్డి తరుపు న్యాయవాది వాదించారు. ఇందులో కుట్ర దాగి ఉందని, రాజారెడ్డి, గంగి రెడ్డి హాస్పిటల్ నుంచి వచ్చి కుట్లు వేశారని న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ ప్రక్రియ జరిగేటప్పుడు అవినాష్ రెడ్డి, కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, శంకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు ఉన్నారని సునీతారెడ్డి తరుపు న్యాయవాది రవిచంద్ వాదించారు.



## బిఆర్ఎస్ రాకున్నా పార్లమెంట్ ప్రారంభోత్సవం ఆగదు

**దేనికి రాకుండా కూర్చుంటున్న కెసిఆర్**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** సచివాలయం ప్రారంభోత్సవానికి గవర్నర్‌ను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని సీఎం కేసీఆర్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ రాకపోతే పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం ఆగిపోతోందా? అని ప్రశ్నించారు. ట్విన్ టవర్స్ శిలాఫలకంపై స్థానిక ఎంపీనైన తన పేరు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌తో నీతులు చెప్పించుకునే పరిస్థితుల్లో బీజేపీ లేదన్నారు. పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. కేంద్రం నిర్వహించే సమావేశాలకు సీఎం కేసీఆర్ హాజరుకాకపోవటం బాధ్యతారాహిత్యమన్నారు. రేపటి నీతీ ఆయోగ్ సమావేశానికి దూరంగా ఉండటం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. సీఎం కేసీఆర్ వైఖరి కారణంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ నష్టపోతోందన్నారు. ప్రధానమంత్రి అధికారిక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రాకపోవడం సిగ్గుచేటన్నారు. మహారాష్ట్రకు వెళ్ళటానికి తీరిక ఉంది కానీ.. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ జయంతికి పూలమాల వేయటానికి కేసీఆర్‌కు తీరికలేదా అని ప్రశ్నించారు. కేంద్రంతో ఘర్షణాత్మకమైన వైఖరితో రాష్ట్రం నష్టపోతోందన్నారు. అవకాశం ఉన్న చోట తెలంగాణ వాయిస్ వినిపించటంలో కేసీఆర్ విఫలం అయ్యారని, ప్రభుత్వాల మధ్యలో ఘర్షణాత్మకమైన వైఖరి వల్ల తెలంగాణకు నష్టమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## దేశం మార్పు కోరుకుంటోంది

**కెసిఆర్‌తోనే మార్పు సాధ్యం**

**దేశంలో అభివృద్ధి జరగడం లేదు**

**తాజా రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు**

**కేంద్రమాజీమంత్రి వేణుగోపాచాలాచారి**

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** రానున్న రోజుల్లో కేంద్రంలో మార్పు తథ్యమని కేంద్ర మాజీమంత్రి, ఇరిగేషన్ డెవలప్మెంట్ ఛైర్మన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎస్. వేణుగోపాలచారి అన్నారు. ఈ మార్పును ఎవ్వరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులతో పాటు రాజకీయ అంశాలపై అంశాలపై గతంకన్నా ఇప్పుడు ప్రజల్లో బాగా చర్చ జరగుతోందని అన్నారు. దేశం మార్పు కోరుకుంటోందని, మార్పు తథ్యమని చారి అన్నారు. ఇప్పటికే ఎందరో ప్రధానులు దేశాన్ని పరిపాలించారని, ఎన్నో ప్రభుత్వాలు రాజ్యాన్ని ఏలాయని.. అయినా.. దేశ పరిస్థితి ఏమాత్రం మారలేదని అన్నారు.

ఇన్ని సంవత్సరాలు గడచినా? ఎక్కడ వేసిన గొంగలి అక్కడే వుండిపోయిందన్న భావన వ్యక్తం చేశారు. ఇన్నేళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా నేటికీ దేశం కరెంట్ కోసం, మంచినీళ్ల కోసం, సాగునీటి కోసం ఇంకా అల్లల్లాడుతూనే వుందన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఎవరి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడుతుంది అన్నది ఇక్కడ ప్రధానం కాదని, ఒక ఉజ్వల భారతం కోసం శ్రమించాల్సిన అవసరం వుందని నొక్కి చెప్పారు. కెసిఆర్ చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కానుందని అన్నారు. దేశంలోని ఏ వర్గం కూడా మోదీ పాలనతో సంతోషంగా లేదని విమర్శించారు. రోజురోజుకీ పరిస్థితి దిగజారి పోతోందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ ఫ్రంట్ కోసం అనేక మంది నేతలతో కేసీఆర్ భేటీ అవుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో పర్యటించారని గుర్తు చేశారు. దేశాన్ని రక్షించుకోవాలన్న ఉద్దేశంతో కేసీఆర్ బిఆర్ఎస్‌ను ఏర్పాటు చేసి, రాజకీయ ప్రత్యామ్నా యం కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దేశ ప్రయోజనాల కోసం మార్పు అవసరం అని, పేద ప్రజల కోసం కూడా మార్పు కావాలని కేసీఆర్ కాంక్షిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిణామాలు, జాతీయ రాజకీయాలు, రాష్ట్రాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కెసిఆర్ స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగుతున్నారని చారి అన్నారు. ద్రవ్యోల్బణం రోజురోజుకు పెరుగుతోరదని.. జీడీపీ పడిపోయిందని, కంపెనీలు మూతపడుతున్నాయని.. రూపాయి విలువ దారుణరగా పడిపోయిందని అన్నారు.



## మాజీమంత్రి జైన్‌కు ఊరట

**ఇంటీరియం బెయిల్ మంజూరు చేసిన సుప్రీం**

**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ కు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, ఢిల్లీ ఆరోగ్య శాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో సుప్రీంకోర్టు అతనికి ఇంటీరియం బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది మనీ ల్యాండరింగ్ కేసులో అరెస్టయి.. తిహార్ జైలులో ఉన్న ఆయన గురువారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో బాత్‌రూంలో పడిపోయారు. దీంతో జైన్‌ను గదికి తరలించి వైద్యులు పరిశీలించారు. వారి సూచన మేరకు తొలుత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఆయన ఐసీయూలో ఆక్సిజన్ మద్దతుతో చికిత్స పొందుతున్నారు. తనకు వెన్నెముక, ఎడమ కాలు, భుజం నొప్పి ఉందని జైన్ వైద్యులకు తెలిపారు. ఢిల్లీ మాజీ మంత్రి ఏడాదిగా తిహాడ్ జైలులోని సెల్ నం.7లో అండర్ ట్రయల్ ఖైదీగా ఉంటున్నారు.ఆ సందర్భంగా శారీరకంగా బాగా నీరసించినట్లు కనిపిస్తున్న ఫొటోలను ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం కేజీవ్రాల్ బయటపెట్టారు. జైన్ 35 కిలోల బరువు తగ్గినట్లు పేర్కొన్నారు. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టులో ఆయన తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కూడా ఇదే విషయాన్ని తెలిపారు. దీంతో ఆయనకు ఇంటిరిమ్ బెయిల్ మంజూరు చేసింది.

## క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరిట టోకరా

**న్యాయవాదికి టోకరా వేసిన కేటుగాళ్లు**

**కామారెడ్డి,మే26(ప్రజా మంటలు):** క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ పేరిట న్యాయవాదికి సైబర్ కేటుగాళ్లు కుచ్చుటోపి పెట్టారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన వెంకటరత్నం అనే న్యాయవాదికి ఎస్‌బీఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ చేయాలంటూ సైబర్ నేరగాళ్ళు ఫోన్ కాల్ చేశారు. వెంకటరత్నం మొబైల్ నెంబర్‌కు సైబర్ కేటుగాళ్లు ఓటీపీ పంపారు. దీంతో తిరిగి ఓటీపీని బాధితుడు వెంకటరత్నం అవతలి వ్యక్తికి పంపారు. అనం తరం వెంకటరత్నం బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 33,500 డెబిట్ అయినట్లుగా మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన వెంకటరత్నం స్థానిక కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఆర్టీసీ నర్సింగ్ కళాశాలలో బిఎస్సీ నర్సింగ్

**దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం: సజ్జన్నార్**

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** హైదరాబాద్‌లోని తార్నాక ఆర్టీసీ దవాఖానలో నర్సింగ్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరంకు నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లుగా ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు. నర్సింగ్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి మేనేజ్ మెంట్ కోటాలో నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నాలుగేళ్ళ కోర్సులో చేరడానికి ఇంటర్ బైపీసీ ఉతీర్ణులైన 17 ఏళ్లు నిండిన విద్యార్థినులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు ప్రవేశాలకు 9491275513, 7995165624 ఫోన్ నంబర్లను సంప్రదించ వచ్చని తెలిపారు. తార్నాక ఆర్టీసీ దవాఖానలో నర్సింగ్ కళాశాలను 2022 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించారు. ఇందుకు రాష్ట్రానికి చెందిన యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, కౌన్సిల్ రిజిస్ట్రేషన్ అనుమతి ఉంది. కన్వీనర్ కోటాలో 30 సీట్లు, యాజమాన్య కోటాలో 20 సీట్లు చొప్పున మొత్తం 50 సీట్లు ఉంటాయి. ఆర్టీసీ సిబ్బందికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించేందుకు తార్నాక దవాఖానను ఆధునీకరిస్తుంది.



## పాస్‌పోర్టు విషయంలో రాహుల్‌కు ఊరట

**మూడేళ్లకు నో ఆబ్జెక్షన్ జారీకి అనుమతి**

**న్యూఢిల్లీ,మే26(ప్రజా మంటలు):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి భారీ ఊరట దక్కింది. పాస్‌పోర్ట్ విషయంలో రాహుల్‌కు అనుకూలంగా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు వెలువరించింది. మూడేళ్ల పాటు పాస్‌పోర్ట్ పొందేందుకు అనుమతించింది. ప్రధాని 'మోదీ ఇంటి పేరు' వ్యాఖ్యల కేసులో గత మార్చిలో సూరత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. కోర్టు తీర్పుతో రాహుల్ తన ఎంపీ పదవిని కోల్పోయారు. ఇక ఎంపీ పదవిని కోల్పోయిన రాహుల్.. ఆ కోటాలో ఇచ్చిన డిప్లొమాటిక్ పాస్ పోర్ట్ సహా అన్ని రకాల ప్రయాణ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. దీంతో సాధారణ పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో సాధారణ పాస్‌పోర్ట్ ను పొందేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ మేరకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఢిల్లీ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం.. శుక్రవారం విచారణ చేపట్టింది. అయితే రాహుల్ కోరినట్లు పదేళ్లకు కాకుండా మూడేళ్లకు మాత్రమే సాధారణ పాస్‌పోర్ట్ కోసం ఎన్‌వోసీ ఇస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది.




## వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు

**హైదరాబాద్,మే26(ప్రజా మంటలు):** నగరంలో రోజురోజుకు వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. మనుషులు కనిపిస్తే చాలు ఎక్కడ పడితే అక్కడ కండలు పీకేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులపై కుక్కల దాడులు ఎక్కువై పోయాయి. కుక్కల స్వైర విహారంతో ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే జనం జంకుతున్నారు. తాజాగా హైదరాబాద్ పాతబస్తీలో కుక్కల దాడికి ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఆర్ డీఓ టౌన్‌షిప్‌లో ఐదు కుక్కలు మూడేళ్ల బాలుడిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాయి. ట్యూషన్ నుంచి వస్తుండగా చిన్నారిపై ఒక్కసారిగా కుక్కలు విరుచుకు పడ్డాయి. తీవంగ్రా గాయపడ్డ బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం బాలుడికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీధి కుక్కలపై జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాలుడి తల్లిండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కుక్కల నియంత్రణకు స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



## బిజేపి ఇబ్రహీంపట్నం మండల సమావేశం

ఇబ్రహీంపట్నం మే 26 (ప్రజా మంటలు): ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశం లొ మండల అధ్యక్షులు బట్టు జకరయ్య మాట్లాడుతు. మహా జన్ సంపార్క్ అభియాన్ లొ భాగంగా ఈ నెల 30 నుండి జూన్ 30 వరకు మన ఇబ్రహీంపట్నం మండలం లోని అన్ని భూత్ లలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్బంగా, మన ప్రధాన మంత్రి మోడీ పథకాలను ఇంటింటి వెళ్లి తెలుపవలసిన బాధ్యత కార్యకర్తల దే అని ప్రతి కార్యకర్త 20 మందిని కలిసి మన ప్రధాన మంత్రి మోడీ గారు చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి తెలియ చెప్పాలి అని తెలిపారు, రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేస్తే కోరుట్ల నియోజకవర్గం లొ బిజెపి జెండా ఎగురడం కాయం అని తెలిపారు, ఇట్టి కార్యక్రమం లొ జిల్లా కార్యవర్గ సభ్యులు తీగల శ్రీధర్ రెడ్డి, జిల్లా కిషన్ మోర్చా కార్యవర్గ సభ్యులు బైన మహేష్, మండల ప్రధాన కార్యదర్శిలు సుంచు రణధీర్. వై బాలు. ఉపాధ్యక్షులు ఉడుత రాజు. పుప్పాల నగేష్. పంతంగి వెంకటేష్ యాదవ్, మండల కార్యదర్శి దేవన్న, మండల కోశాధికారి కుమార్ బీజేవైఎం మండల అధ్యక్షులు బోడ నవీన్ రెడ్డి. ఉపాధ్యక్షులు పుస్తెమ్ మహేందర్. మండల కిషన్ మోర్చా అధ్యక్షులు గడ్డం సంజీవ్ రెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మాలేపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్లేందుల చారి.బూత్ అధ్యక్షులు మారుతీ పుప్పాలా మల్లేష్, గణేష్ నాయకులు కౌడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించాలి

ఇబ్రహీంపట్నం మే 26 (ప్రజామంటలు): పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని భారతదేశ ప్రథమ పౌరు రాలైన రాష్ట్రపతి ఆదివాసి ముద్దుబిడ్డ ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని, ఆదివాసి నాయకపోడు సేవా సంఘం- అధ్యక్షుడు చాట్ల రాజేందర్ డిమాండ్ చేశారు. పత్రిక ప్రకటన మంగళవారం రోజు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నతమైన పార్లమెంట్ భవనాన్ని దేశ ప్రజల సహాయ సహకారాలతోనే నిర్మాణం జరిగిందని అట్టి భవన ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఎలాంటి అర్హత లేదని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన 85వ ఆర్టికల్ ప్రకారం అది రాష్ట్రపతికే ప్రారంభోత్సవ అర్హత దక్కుతుందని అన్నారు, ఆదివాసీ మహిళ అని అవమానపరిచే విధంగా చేస్తే సహించబోమని రాష్ట్రపతిచే ప్రారంభించాలని లేదంటే ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రపతి అనివార్య కారణాల వల్ల లేకపోతే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి చేసే అధికారం ఉంటుందాని డిమాండ్ చేశారు, దేశవ్యాప్తంగా 30 కోట్ల ఆదివాసీలను అవమాన పరిచినట్టేనని, లేదంటే భారతదేశంలోని అన్ని సంఘం ఏకమై తిరగబడక తప్పదని హెచ్చరించారు.

## రాజకీయాల్లో యువత పాత్ర కీలకం

### జనసేన పార్టీ నాయకులు గాదె పృథ్వి

### జనసేనలో చేరిన రాంపూర్ యువత

ధర్మసాగర్ మే 26 (ప్రజా మంటలు) : రాబోయే సాధారణ ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన పాత్ర కీలకమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ గాదె పృథ్వి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని రాంపూర్ గ్రామంలో జనసైనికులతో కలిసి ర్యాలీగా వచ్చి గ్రామంలో పర్యటించారు. అనంతరం గ్రామ యువతను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. యువత రాజకీయాల్లో ఉంటే అవినీతి జరగదన్నారు. నియోజకవర్గంలో అవినీతి పేరుకుపోయిందని ఏద్దేవా చేసారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పనలో పాలకులు విఫలమయ్యారని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో యువత జనసేన పార్టీ వెంట ఉండి మార్పుకు



నడుంబిగించారన్నారు. అన్నీ గ్రామాల్లో యువత జనసేన వైపు చూస్తున్నారని తెలిపారు. యువతను ఏకం చేసి జనసేన సత్తా చాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో తరుణ్, వివేక్, అర్జున్, మౌనిత్,చందు, అఖిల్, కార్తీక్ శశి, రక్షిత్,అజయ్, ప్రేమ్, సందీప్ ,పార్టీ శ్రేణులు మహమ్మద్ రజాక్, మునిగాల పవన్ పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ

వేలేరు మే 26 (ప్రజా మంటలు): వేలేరు మండల క్రీడాకారులు ఇటీవల జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జిల్లాలో మొదటి స్థానంలో వేలేరు గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకువచ్చిన సందర్భంగా వారిని అభినందించి క్రీడాకారులకు అప్పర్ ,లోయర్ ట్రాక్ సూట్ లను వేలేరు సర్పంచ్ కాయిత మాధవరెడ్డి శుక్రవారం అందజేశారు. క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించి మంచి ప్రతిభను కనబరిచి మన గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని వారిని ఆశీర్వదించారు. అనంతరం వేలేరు ఎస్సై డి.హరిత ను కలిసి జిల్లాస్థాయిలో సాధించిన సీఎం కప్ బహుమతిని వేలేరు పోలీస్ స్టేషన్





కు సర్పంచ్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, భాస్కర్, వినయ్ ప్రవీణ్, అభిరామ్, సాయి, విష్ణు, అఖిల్, విక్రమ్,శ్రీశైలం, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల సపోర్టు లేకుంటే బిఆర్ఎస్‌కే నష్టం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కలపల్లి శ్రీనివాసరావు

జనగామ మే 26 (ప్రజామంటలు): నేటి రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల సపోర్ట్ లేకుంటే బిఆర్ఎస్ పార్టీకే తీవ్ర నష్టమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు.

శుక్రవారం జనగామలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా సమితి సమావేశం జువారి రమేష్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కల్లపెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి మత రాజకీయాలతో ప్రజలను చీల్చి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న తరుణంలో బిజెపి వ్యతిరేక లౌకికవాద శక్తులన్నీ ఏకమైతేనే సాధ్యమవుతుందని, అందులో కమ్యూనిస్టులు ముందుంటారని బిజెపిని భూస్థాపితం చేయడానికి కమ్యూనిస్టులు ముందుంటా రని శ్రీనివాసరావు అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ బిజెపి వ్యతిరేక శక్తులతో కలిసి వ్యవహరించాలని సూచించారు. అందుకు ఉదా హరణగా ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాలు ఎలాంటి తీర్పునిచ్చాయో, అక్కడి ప్రజలు బిజెపి దేశ సమీకతను దెబ్బతీసే విధంగా ఎలా వ్యవహరించుందో ప్రజలు అర్థం తీసు కొని బిజెపిని ఓడించడం ద్వారా మంచి తీర్పునిచ్చారన్నారు. ఈ తీర్పునే రేపు 2024 సంవత్సరంలో జరిగే పార్లమెంటు ఎన్నికలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కి ప్రజల్లో కొంత వ్యతిరేకత, సంక్షేమ పథకాలు అమలులో అసంతృప్తి వంటి అనేక సమస్యలు ప్రభుత్వానికి ఇబ్బందులుగా తయారైనవని, ఈ తరుణంలో వారు రాజకీయంగా లౌకికవాద శక్తులతో, ప్రధానంగా కమ్యూనిస్టులతో కలసి ఉంటేనే టిఆర్ఎస్ పార్టీకి లాభం జరుగుతుందని బిజెపిని ఓడించడం సాధ్యమవుతుందని శ్రీనివాస రావు అన్నారు.కమ్యూనిస్టులకు సిపిఐ పార్టీకి సిపిఐ ప్రజాపోరు యాత్రల ద్వారా, ఇంటింటికి సిపిఐ కార్యక్రమంతో, లక్షలాది మందిని కలవడంతో మరియు బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి వెళ్ళడం ద్వారా పార్టీ కార్యకర్తలకుఎంతో



ఉత్సాహం వచ్చిందని. ఇది ప్రజల్లో మంచి సంకేతాన్ని ఇచ్చి పార్టీకి పూర్వ వైభవం లభించే విధంగా తయారైందని, ఈ ఉత్సాహంతోనే రాబోయే ఎన్నికల్లో సిపిఐ సిపిఎంలు కలిసి పోటీ చేస్తాయని, ఎన్నికల నాడు బిజెపిని ఓడించే లక్ష్యసాధనగా ఎత్తులు పొత్తులు ఉంటాయని శ్రీనివాసరావు గారు అన్నారు.

దామాషా ఎన్నికల విధానం అంటే బూర్జువా పార్టీలకు ఎంతో భయమని, నోట్లు ఇచ్చి ఓట్లు కొని కోట్లు ఖర్చు ఖర్చు పెట్టే ఈ బూర్జువా పార్టీలకు, మైనార్టీ ఓట్లతో మెజార్టీ సీట్లతో రాజ్యమేలుతున్న వీరికి దో పిడి తప్ప, ప్రజా సంక్షేమం ఏ మాత్రం పట్టదని అన్నారు.

దామాషా ఎన్నికల పద్ధతి అమలు అయితే ఈ దేశంలో గాని రాష్ట్రంలో గాని డబ్బు రాజకీయాల అంతమై, నీతి నిజాయితీ గల నిస్వార్థపరులు, కమ్యూనిస్టులు చట్టసభల్లో కచ్చితంగా గెలిచి తీరుతారని చాలెంజ్ చేస్తున్నాను అన్నారు. రాబోయే రోజుల్లో జరిగేది అదేనని, కమ్యూనిస్టులకు మంచి రోజులు వస్తున్నాయని, కార్యకర్తలు తెగించి ప్రజలకు వాస్తవాలు చెప్పి చైతన్యపరిచి ఉద్యమంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో జిల్లా కార్యదర్శి,. మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి ప్రజా పోరు యాత్ర చివరి బహిరంగ సభ అయిన జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో జరుగు భారీ బహిరంగ సభకు జనగామ జిల్లా నుండి వందలాది మంది కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు, పోరాటాల గడ్డ జనగామలో తిరిగి మళ్లీ పాత రోజులు రాబట్టడానికి గ్రామ గ్రామాన తిరిగి ఎర్రజెండా ఎగరేసే విధంగా కార్యకర్తలు రాజకీయ చైతన్యవంతులై ఉద్యమ బాట పట్టాలని, జనగామ జిల్లాలో ఎన్నికల్లో సిపిఐ పార్టీ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతురు సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శిలు ఆకుల శ్రీనివాస్ ఆది సాయన్నలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగళంపల్లి జనార్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులుకావటి యాదగిరి రావుల సదానందం, పైసా రాములు,చింత కింది అరుణ, కె మిడి మల్లయ్య, చామకూర యాకూబ్, గుర్రం మధు, తోట రమేష్ బొమ్మినేని వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి

ఎల్కతుర్తి మే 26 (ప్రజా మంటలు): ఎల్క తుర్తి మండల కేంద్రం లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి మాట్లాడారు. ఈజీఎస్ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ జీఎస్టీ లు వేసి పేదవాని పొట్ట కొడుతుంది బిజెపి ప్రభుత్వం బిజెపి, బీఆర్ఎస్ రెండూ ఒకటే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నియంత్రణ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం దేవాదుల నీళ్లు రాక తీవ్ర ఇక్కట్లు పడుతున్న రైతాంగం సీఎం స్వంత నియోజక వర్గం తప్ప, మిగతా నియోజక వర్గాల అభివృద్ధి శూన్యం గండిపల్లి ప్రాజెక్టు కు తట్టెడు మట్టి పోయలేదని, సోషల్ మీడియా లో కార్య కర్తలు ఆక్టివ్ గా ఉండాలని కోరారు.

కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నూతన పార్లమెంటు భవన ప్రారంభానికి గిరిజన బిడ్డ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ను అహ్వానించక పోవడం అనేది గిరిజన జాతి పై వివిక్ష చూపడమేనాని, పార్ల మెంటు లో అదానీ ఆస్తుల గూర్చి ప్రశ్నించినందు కే రాహుల్ పై పార్లమెంటులో కక్ష పూరితంగా రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసి, ఇళ్లు ఖాళీ చేయించారని విమర్శించారు. ప్రాణ త్యాగాలు చేసిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ల కుటుంబా,న్నిఅవమాన పర్చిన మోడీ ప్రభుత్వం మత ద్వేషాలను రెచ్చగొడితేనే, ఓట్లు పడుతాయన్న యోచన లో బీజేపీ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటు పరం చేస్తున్న బిజెపి, నేడు వాడుతున్న సాంకేతికత ను తీసుకు వచ్చింది రాజీవ్ గాంధీఏ నై అన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ దశాబ్ద కాలంలో శతాబ్ది అభివృద్ధి జరిగింది అని చెప్పుకుంటున్న కేసీఆర్ కానీ ఆ అభివృద్ధి తెలంగాణ కు కాదు, కేసీఆర్ కుటుంబానికి మాత్రమేనాని,



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున తెలంగాణ ప్రజల ఆకాంక్ష ను నెరవేర్చిన సోనియమ్మ చిత్ర పటానికి పాలాభిషేకం చేయాలనీ కార్యకర్తలకు పిలుపునిచ్చిన పొన్నం, తేమ పేరుతో ధాన్యం కొనుగోలు లో తరుగు తీసి రైతుల పొట్ట కొడుతున్న మిల్లర్లు, 9 ఏళ్ల నుండి పేద ప్రజలను పట్టించు కొని కేసీఆర్ కు ఎన్నికలు వస్తేనే బడుగు, బలహీన వర్గాలు గుర్తుకు వస్తాయని, ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజలకు తెలియ జేయాలనీ కార్యకర్తలకు సూచించారు.

సమావేశం లో కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి తో పాటుగా పిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, కేడం లింగ మూర్తి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బంక సంపత్ యాదవ్, ఎల్కాతుర్తి మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, మండల పార్టీ అధ్యక్షులు ఎంపిటిసి ఎలిగేటి ఇంద్ర సేనా రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు పిన్నింటి సుష్మా రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హింగే శ్రీకాంత్, సర్పంచ్ లు చల్ల మల్లా రెడ్డి, దాట్ల రాములు, చల్ల రవీందర్ రెడ్డి, సింగిల్ విండో డైరక్టర్ ముప్పు మహెందర్, జిల్గుల మాజీ సర్పంచ్ రమేష్ గౌడ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ అక్తర్, సిద్దిపేట్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండ సుమన్ గౌడ్, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మహిళపై జరిగే నేరాలపై షీ-టిమ్ అవగాహనా సదస్సు

### అవగాహన పెంచుకొండి, మోసాలకు గురి కాకకండి

### - షీ టీమ్ ఎస్ ఐ విద్యాసాగర్

హనుమకొండ మే 26 ( ప్రజామంటలు) : పింగిలి కాలేజీ ఫర్ ఉమెన్ (స్వయం ప్రతిపత్తి) హన్మకొండలో దాదాపుగా 100 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ కంచి విద్యాసాగర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్ మరియు ర్యాగింగ్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు ఎవరి నుండైన ఇబ్బందులకు గురైనప్పుడు, ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని,మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సి.




పి. గారి వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్.ఐ.వాట్సాప్ నెంబర్ 8712685270కి పిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, లెక్చరర్ లతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా. బి. చంద్రమౌళి మాట్లాడుతూ నేటి కాలంలో అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలని ప్రయాణాలు చేసేటప్పుడు అపరిచిత వ్యక్తులతో ఎలాంటి విషయాలను, ఫోన్ నంబర్లను, ఫోటోలను షేర్ చేసుకోవద్దని, సోషల్ మీడియాలో పరిచయమైన వారితో ఎలాంటి వ్యక్తిగత విషయాలను షేర్ చేసుకోవద్దని, ప్రేమ పేరుతో వాళ్లు చెప్పే మాటలను నమ్మి తల్లిదండ్రులకు తెలుపకుండా తెలియని ప్రదేశాలకు వెళ్లకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సబ్ -ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ వి. వేణుగోపాల్ రెడ్డి మరియు హెడ్ కాన్స్టేబుల్ బిచ్య నాయక్,కాలేజీ లెక్చరర్స్ ఎన్ ఎస్ ఎస్ పి ఒ. ఐ.మంగమ్మ, డి. రాధిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హలో రెడ్డి .. చలో కరీంనగర్..

## రెడ్డి కార్పొరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

### రెడ్డి సంఘం అధ్యక్షులు గాదే రఘునాథ్ రెడ్డి...

చిగురుమామిడి మే 26 (ప్రజా మంటలు): మండలంలోని రెకొండ చిగురు మామిడి లంబాడి పల్లి సీతారాంపూర్ సుందరగిరి కొండాపూర్ గాగిరెడ్డి పల్లి ఇందుర్తి తదితర గ్రామాలలో శుక్రవారం రోజు న జిల్లా రెడ్డి సంఘం నాయకులు జూన్ 6 న కరీంనగర్లో జరగబోయే రెడ్ల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం ఇందుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రెడ్డి కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలనీ ప్రధాన డిమాండ్ తో పాటు నిరుపేద రెడ్డి లు అనేక సమస్యలతో పాటు పలు డిమాండ్లతో జూన్ 6 అనేక డిమాండ్లతో కూడిన రెడ్డిల ఆత్మీయ సమ్మేళనం కరీంనగర్ శివారులో చింతకుంట లో %హుం=% గార్డెన్ లో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనానికి చిగురు మామిడి మండలంలో ఉన్న అన్ని గ్రామాల రెడ్డి సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా RBVR ప్రధాన కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్ రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి చిగురుమామిడి మండల ఐక్యవేదిక ఇంచార్జ్ కాటం సంపత్ రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్షులు పరిపాటి జయపల్ రెడ్డి గడ్డం సురేందర్ రెడ్డి కటం సంపత్ రెడ్డి వడియల రవీందర్ రెడ్డి అన్నడి ఎల్లారెడ్డి గాదె రఘునాథ రెడ్డి సింగిల్ విండో అధ్యక్షుడు జంగ వెంకట రమణ రెడ్డి సర్పంచులు గోలి బాపురెడ్డి నాగెల్లి వకుళ లక్ష్మ రెడ్డి ఉప సర్పచ్ సత్యనారాయణ రెడ్డి పన్యాల వాసుదేవ రెడ్డి మల్లారెడ్డి సంపత్ రెడ్డి సంజీవరెడ్డి బజార్





రాజిరెడ్డి చెంద్ర రెడ్డి రాజేశ్వర్ రెడ్డి రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు కార్యదర్శులు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో
# ఇద్దరు యువకుల మృతి

**భీమదేవరపల్లి మే26 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్య పూర్ గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా వివరాల్లోకి వెళ్తే.. మాణిక్య పూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి నిరంజన్ (31) తన మామ తో బైక్ పై మాణిక్యపూర్ గ్రామం నుండి హుజురాబాద్ వెళ్తున్న క్రమంలో, గట్టు గోపి (30) కి చెందిన వాహనాన్ని మాణిక్యాపూర్ గ్రామ సమీపంలోకి ఢీ కొట్టడంతో తాళ్లపల్లి నిరంజన్, గట్టు గోపి అక్కడికక్కడే మృతి చెందారు. నిరంజన్ మామ కు తీవ్ర గాయాలు 9కాగా 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన తాళ్లపల్లి నిరంజన్ కు ఆరు నెలల క్రితమే వివాహం జరిగింది. ప్రమాద సంఘటన గూర్చి సమాచారం అందుకున్న ఎల్కతుర్తి సిఐ ప్రవీణ్ కుమార్, ముల్కనూర్, వంగర ఎస్సైలు మహేందర్, వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు

## తిరుమల, కాణిపాకంలో మంత్రి కొప్పుల

**ధర్మపురి మే 26 (ప్రజా మంటలు):** తిరుపతిలో కలియుగ దైవం అయినటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కుటుంబ సభ్యులతో కలిసి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తిరుమలలో శ్రీవారి దర్శించుకున్నారు. తదుపరి, చిత్తూరు జిల్లా శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక



స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహియిర్వహించారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచణం చేయగా ఆలయ ఈవో వరసిద్ధి వినాయక స్వామి శేష వస్త్రంతో మంత్రి గారి సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కాణిపాక గణనాథు దర్శించుకోవడం చాల సంతోషంగా ఉందు మంత్రి తెలిపారు.

## పెగడపెళ్ళి, ధర్మపురి హాస్టల్ భవనాల
# నిర్మాణాలకి నిధుల మంజూరీ

**ధర్మపురి మే 26 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం లో ధర్మపురి, పెగడపల్లి, మండలాల్లో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో 4 కోట్లతో ఎస్సీ హాస్టల్స్ భవనాల నిర్మాణాకి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ. చేసింది. ధర్మపురి మండలం ధర్మపురి గ్రామంలో సర్వే నెంబర్.1170 లో 27 గుంటల విస్తీర్ణం లో ఎస్సీ హాస్టల్ భవనం నిర్మాణాకి 2 కోట్ల నిధులు మంజూరు, పెగడపల్లి గ్రామంలో సర్వే నెంబర్. 811 (బంచారై) లో 1.00 ఎకరాల విస్తీర్ణం, లో ఎస్సీ హాస్టల్ భవనం నిర్మాణాకి 2 కోట్ల నిధులు మంజూరుచేశారు.

# గాంధీఆస్పత్రిలో పనుల వేగం పెంచండి..

### జూన్ 14న ప్రారంభానికి సిద్ధం చేయండి..
### టీఎస్ఎమ్ఎస్ఐడీసీ ఛైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్

**సికింద్రాబాద్, మే 26 (ప్రజామంటలు):** టీఎస్ఎమ్ఎస్ఐడీసీ ఛైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో కలసి గాంధీ ఆసుపత్రిని సందర్శించి, ప్రొగ్రెస్ లో ఉన్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మాత, శిశు సంరక్షణ కేంద్రం (ఎం.సీ.హెచ్) భవనం, డైట్ క్యాంటీన్ భవనం, 8వ ఫ్లోర్ లో ఏర్పాటు చేయనున్న స్టేట్ ఆర్గాన్



ట్రాన్స్ప్లాంట్ సెంటర్ (ఎస్.ఓ.టీ.సీ) ల పనులను త్వరితగతిన చేయాలని శ్రీనివాస్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వచ్చే నెల 14న వీటి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. పనుల పురోగతి, తదితర అంశాలపై ఆయన సూపరింటెండెంట్ ప్రొ.ఎం.రాజారావు, ఆర్ఎంవో డా.జయకృష్ణ, టీఎస్ఎమ్ఎస్ఐడీసీ ఛీప్ ఇంజనీయర్ రాజేందర్ కుమార్, ఎస్.ఈ సురేందర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కౌటిల్య, డీఈఈ దుర్గా ప్రసాద్ లతో సమావేశమై రివ్యూ నిర్వహించారు.

### బోజనం ఇలా ఉంటే ఎలా...?

గాంధీ ఆసుపత్రి ఆవరణలో జీహెచ్ఎమ్సీ-హరేరామ హరేకృష్ణా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూ 5ల బోజనశాలను సందర్శించారు. అక్కడ బోజనాన్ని తిన్న ఆయన క్వాలిటీ పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కారం, ఉప్పు తక్కువగా ఉందని, ఇలా ఉంటే తెలంగాణ వాళ్ళు ఎలా తింటారని ప్రశ్నించారు. కనీస నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.






# ప్రభుత్వానికి -పార్టీకి కార్యకర్తలు వారధిగా పని చేయాలి

కరీంనగర్ ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతాం
భారత రాష్ట్ర సమితి మన ఇంటి పార్టీ.. ప్రతి కార్యకర్త పార్టీకి అండగా నిలవాలి..
ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్ మే 26 (ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను.. ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్తూ ప్రభుత్వానికి – పార్టీకి కార్యకర్తలు వారధిగా పని చేయాలనీ బీసీ సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు..

శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజశ్రీ గార్డెన్ లో భారత రాష్ట్ర సమితి కరీంనగర్ నగర పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..

ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ అన్ని రంగాల్లో వివక్షతకు గురైందని అన్నారు... సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర న్ని.. సాధించకపోతే మన భవిష్యత్తు ఎలా ఉండేదో.. ఊహించుకోవడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు...
తెలంగాణ రాష్ట్రంలో సమైక్యవాద పార్టీలకు స్థానం లేదని... తెలంగాణ వనరులను దోచుకెళ్లేందుకు మరోసారి కుట్ర జరుగుతుందని... పాదయాత్రల పేరుతో కొన్ని విష సర్పాలు తెలంగాణపై దాడి చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు....తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ గారికి ప్రతి కార్యకర్త అండగా నిలవాలని అన్నారు... పార్టీ భవిష్యత్తు కార్యకర్తల చేతుల్లో ఉందని.. ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టతకు కష్టపడి పని చేయాలని అన్నారు.. బిఆర్ ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలను పార్టీ కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని అన్నారు.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన ఏకైక పార్టీ భారసా అని.. కెసిఆర్ పరిపాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండా అని మూడోసారి ప్రభుత్వ అధికారంలోకి వస్తుందని అన్నారు..

### అభివృద్ధిలో అగ్రగామిగా కరీంనగర్..

సమైక్య రాష్ట్రంలో గత ప్రభుత్వాలకు కరీంనగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మనసు రాలేదని.. నిధులు లేక కరీంనగర్ అభివృద్ధి కుంటుపడిందని.. నగరంలో ఎక్కడ చూసిన గుంతల రోడ్లు, రోడ్ల మధ్యలో స్తంభాలు.ప్రజలంతా దుమ్ముదులితో అవస్థలు పడేవారని అన్నారు.. తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని.. ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని. కరీంనగర్ ప్రజల జీవన ప్రమాణాలు మెరుపడ్డాయని.. శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని.. చెరువులు కుంటలు మత్తడి దునుకుతున్నాయని అన్నారు.. 10 సంవత్సరాల కాలంలో కరీంనగర్ రూపురేఖలు మారిపోయాయి అని అన్నారు.. కరీంనగర్ ను పర్యాటక రంగంగా తీర్చిదిద్దేకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానే రివర్ ఫంటు తీగల వంతెన నిర్మాణాలతో కరీంనగర్ కు పర్యాటక శోభ సంతరించుకుందని అన్నారు.. తీగల వంతెన పనులు తురుదశకు చేరుకున్నాయని జూన్ 17న ప్రారంభోత్సవం చేసుకుంటామని అన్నారు.. మానేరు రివర్ ఫ్రంట్ మొదటి దశ పనులు ఆగస్టు 15 వరకు పూర్తిచేస్తామని వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు.. బారాస జిల్లా అధ్యక్షులు సుడా చైర్మన్ జివి రామకృష్ణారావు.. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు.. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, పలువురు కార్పొరేటర్లు అనుబంధ కమిటీల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు..

# గోదావరి హారతి యాత్రను విజయవంతం చేయాలి

### జూన్ 3 నుండి 8 వరకు యాత్ర.
### గోదావరి మహా హారతి రాష్ట్ర కన్వీనర్ లింగంపల్లి వీర గోపాల్.

**జగిత్యాల్ మే 26 (ప్రజా మంటలు):** గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జూన్ 3 నుండి 8వ తేదీ వరకు నిర్వహించనున్న గోదావరి హారతి యాత్రను విజయవంతం చేయాలని గోదావరి మహా హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపల్లి వీరగోపాల్ కోరారు. గోదావరి మహా హారతి యాత్ర వివరాలతో కూడిన పోస్టర్లను శుక్రవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరగోపాల్ మాట్లాడుతూ గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జూన్ 3న నిజామాబాద్ జిల్లా కందకుర్తి నుండి ప్రారంభమై జూన్ 8 వరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం చేరుకుంటుందని తెలిపారు. బిజెపి జాతీయ నాయకులు గోదావరి హారతి వ్యవస్థాపక చైర్మన్ పి. మురళీధర్ రావు నేతృత్వంలో ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. జల వనరుల పరిరక్షణ దిశలో ప్రజలను సమాయత్తం చేయడంతో పాటు నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరాన్ని ఈ యాత్ర సందర్భంగా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. మన రాష్ట్రంలో ఐదు జిల్లాల గుండా ప్రవహిస్తున్న గోదావరి జల వనరులను కలుషితం కాకుండా చేపట్టవలసిన చర్యలను వివరిస్తూ యాత్ర కొనసాగుతుందన్నారు. 6 రోజులపాటు సుమారు 800 కిలోమీటర్ల వరకు గోదావరి తీర ప్రాంతాలలోని 285 గ్రామాల గుండా యాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు.



జగిత్యాల జిల్లాలో జూన్ 5 సోమవారం ఇబ్రహీంపట్నం మండలం కొండాపూర్ లో ప్రవేశించి ధర్మపురిలోని రాయపట్నం వద్ద ముగుస్తుందని, అనంతరం మంచిర్యాల జిల్లాలో ప్రవేశిస్తుందన్నారు.

జూన్ 5న సాయంత్రం ధర్మపురి లోని గోదావరి నదీమ తల్లికి హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర కో-కన్వీనర్, రాష్ట్ర రూట్ ఇన్చార్జ్ క్యాతం వెంకటరమణ, జిల్లా సభ్యులు సంగి నరసయ్య, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, బిజెపి ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్లకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలి

**కోరుట్ల టౌన్ మే 27 (ప్రజా మంటలు):** ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 5లక్షలు, కేంద్రం ప్రభుత్వం 10 లక్షలు ఇవ్వాలి. ఇండ్ల స్టలాల సాధనకై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం. జి. నాగయ్య సిపిఎం పార్టీ కేంద్ర కమిటి సభ్యులు.డిమాండ్ చేశారు.

కోరుట్ల పట్టణంలో సంగెం రోడ్డుకు జంబి గద్దె పక్కన సర్వే నెంబర్ 923 లో గల ఉన్న ప్రభుత్వ భూమిలో నిరు పేదలు చేస్తున్న భూ పోరాట కేంద్రాన్ని శుక్రవారం రోజున జి.నాగయ్య సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఎస్. వీరయ్య సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సందర్శించారు. పాటలతో, ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా భూ పోరాటానికి ముఖ్య అతిధిగా వచ్చిన జి. నాగయ్య సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రభుత్వ అసైన్మెంట్ భూమిలో ఇండ్లు లేని, భూమి లేని నిరుపేద మహిళలు గత నెల రోజుల నుండి ఇండ్ల స్థలాలా కోసం పోరాటం చేస్తుంటే, ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ఒక వైపు పోరాటం చేస్తున్న మహిళలను బెదిరించారు.అయిన కూడా పోరాటం ఆపలేదు.రాష్ట్రంలో ఇప్పటికే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చాలా ప్రాంతాల్లో భూ పోరాటాలను కొనసాగిస్తున్నాం.ప్రభుత్వం హామీలమేరకు పోరాటం చేస్తున్న మహిళలకు ప్రభుత్వం అండగా నిలబడాలి. ఎస్. వీరయ్య సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ... భూ పోరాట మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ,5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ఇవ్వాలి.ఈ రోజు పేదలు చేస్తున్న భూ పోరాటం చాలా న్యాయమైనది. రాజ్యాంగ బద్దమైనది. ఎందుకంటే ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి, ప్రతి ఒక్కరికి ఉండటానికి




ఇల్లు, ఇంట్లోకి కరెంటు, అందరికి చేయడానికి పని ప్రభుత్వాలు కల్పించాలి. కానీ ప్రభుత్వాలు ఇల్లు, పని, విద్య, వైద్యం కల్పించకపోవడంతో ఈ రోజు ప్రజలే అసైన్మెంట్ భూములను దోపిడీ దారుల, అక్రమ దారుల నుండి కాపాడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భూ పోరాటం చేస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి.లేకుంటే ఈ భూ పోరాటాన్ని రాష్ట్ర ఉద్యమంగా మారుస్తాము. పైళ్ల ఆశయ్య సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్థానిక జిల్లా కలెక్టర్ గారు, స్థానిక తహసీల్దార్ మరియు ప్రజా ప్రతినిధులు అందరు స్పందించి భూ పోరాటం చేస్తున్న నీరు పేద మహిళలకు అండగా నిలబడాలి.

ఈ కార్యక్రమంలో జి. తిరుపతి నాయక్ సిపిఎం జిల్లా కన్వీనర్, ఇందూరి సులోచన సి ఐ టి యు జిల్లా కన్వీనర్, భూ పోరాట కన్వీనర్ గుమ్మడి రమేష్, రజియా సుల్తాన్ అవాజ్ జిల్లా కార్యదర్శి, ఏళ్ల .పోచన్న సిపిఎం కోరుట్ల పట్టణ కార్యదర్శి, కొంచెం శంకర్ వడ్డెర జిల్లా ప్రధాన కార్యదర్శి, కడకుంట్ల నాగరాజు సీఐటీయూ జిల్లా నాయకుడు , తదితరులు పాల్గొన్నారు

# అమరావతిని సర్వనాశనం చేసే కుట్ర

### సెంటు పట్టాలతో ప్రజలకు మోసం: బోండా ఉమ

**అమరావతి,మే26(ప్రజా మంటలు):** రాజధాని అమరావతిలో ప్రభుత్వం సెంటు భూమి పంచడంపై టీడీపీ నేత బోండా ఉమ ధ్వజమెత్తారు. అమరావతిపై కక్షతోనే సీఎం జగన్ సెంటు పట్టాల నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. అమరావతి లక్ష్యాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు. రాజధాని కోసం భూమిఇచ్చిన రైతులను మోసంచేశారని విమర్శించారు. సెంటు పట్టాలు అనేవి ఒక బోగస్‌గా కొట్టిపారేశారు. కనీస వసతులుగా రోడ్లు, కరెంట్ ఏమీ లేకుండానే సెంటు పట్టాలు పేదలకు ఇస్తే ఏమీ చేసుకుంటారని ప్రశ్నించారు. అయినా సుప్రీం కోర్టు సెంటు పట్టాకు చట్టబద్ధత లేదని చెప్పినా జగన్ పేదలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో జరిగే ముఖ్యమంత్రి సభకు ప్రజలను బలవంతంగా తరలిస్తున్నారని ఆరోపించారు.



# ప్రభాస్ అభిమానులకు స్పెషల్ ట్రీట్

## ఆదిపురుష్ రిలీజ్ రోజే సలార్ డేట్ ప్రకటన

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా వస్తున్న తాజా చిత్రం ఆదిపురుష్. ప్రభాస్ రాముడిగా చేస్తున్న ఈ సినిమా జూన్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ సీతగా కనిపిస్తుండగా, ఓం రౌత్ దర్శకత్వం వహిస్తున్నాడు.



ఈ సినిమా నుండి ఇప్పటికే రిలీజైన సాంగ్స్, పోస్టర్స్ కు ఆడియన్స్ నుండి క్రేజీ రెస్పాన్స్ వచ్చింది. ఇక రీసెంట్ గా రిలీజైన ట్రైలర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. దీంతో చిత్ర రిలీజ్ కోసం ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అయితే, తాజాగా వినిపిస్తున్న న్యూస్ ఒకటి ప్రభాస్ ఫ్యాన్స్ కు తెగ ఖుషీ చేస్తోంది. అదేంటంటే, ఆదిపురుష్ సినిమా రిలీజ్ తోపాటే సలార్ సినిమా టీజర్ ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యూస్ ఒకటి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న సినిమాల్లో భారీ ఎక్స్పెక్టేషన్స్ ఉన్న సినిమా అంటే సలార్ అనే చెప్పాలి. దానికి కారణమా కేజీఎఫ్ తరువాత ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న సినిమా అవడం. దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెప్టెంబర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. చాలా రోజుల నుండి ఈ సినిమా టీజర్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా వినిపిస్తున్న న్యూస్ తో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నిజంగా ఆదిపురుష్ సినిమాతో సలార్ టీజర్ రిలీజ్ చేస్తే ఫ్యాన్స్ కు డబల్ ట్రీట్ ఖాయం అని చెప్పాలి.

# సలార్‌లో పవర్‌ఫుల్ లేడీ శ్రీయారెడ్డి

ప్రభాస్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం సలార్. కేజీఎఫ్ సక్సెస్ తరువాత ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రం పై ఇండియా వైడ్ భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి హోంబలే ఫిల్మ్స్ నిర్మాణ బాధ్యతలు చేపడుతున్నాయి. సెప్టెంబర్ 28వ తేదీన ఈ మూవీ విడుదల చేస్తున్నట్లు ఎప్పుడో ప్రకటించేశారు. కాగా ఈ మూవీకి సంబంధించి ఓ షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ మూవీలో ఓ పవర్ ఫుల్ లేడీ క్యారెక్టర్ లో శ్రీయా రెడ్డి కనిపించనున్నారట. శ్రీయా అనగానే హీరోయిన్ శ్రియ అనుకొని పొరపాటుపడేరు. కాదు.. విశాల్ పొగరు సినిమా చూసిన వారికి శ్రియా రెడ్డి పరిచయమే. ఆమె అందులో నెగిటివ్ రోల్ లో నటించి అదరగొట్టారు. ఆ తర్వాత కూడా ఆమె చాలా సినిమాలు చేశారు. కానీ ఈ సినిమా ఆమె కెరీర్ లోనే హైలెట్ అని చెప్పాలి. చాలా కాలంగా సినిమాల కు దూరంగా ఉంటున్న ఆమె ఇమె ఇప్పుడు సలార్ లో నటిస్తోందట. ఈ విషయాన్ని ఆమె స్వయంగా ట్విట్టర్ వేదికగా తెలియజేయడం విశేషం. ప్రశాంత్ నీల్ ఓ క్యారెక్టర్ కి శ్రియారెడ్డి అయితేనే బాగా సరిపోతుందని భావించారట.



వెంటనే ఆమెను సంప్రదించడంతో ఆమె అంగీకరించారు. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ డీఓపీ భువన్ తో కలిసి దిగిన ఫోటోని షేర్ చేసిన ఆమె తాను కూడా సలార్ లో భాగమైనందుకు సంతోషంగా ఉందని కామెంట్ చేశారు. దీంతో ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ గా మారింది.మామూలు క్యారెక్టర్లే ఇరగదీసే శ్రియా రెడ్డి కి ప్రశాంత్ నీల్ ఎంత పవర్ ఫుల్ క్యారెక్టర్ ఇచ్చాడా అనే ఆసక్తి మొదలైంది. మరి ఆమె పాత్ర ఎలా ఉంటుందో తెలియాలంటే సినిమా విడుదలయ్యే వరకు ఆగాల్సిందే.ఇదిలా ఉండగా సలార్ మూవీ టీజర్ జూన్ లో విడుదల చేయనున్నారు. ఆదిపురుష్ మూవీ జూన్ 16న విడుదల అవుతుండగా ఆ రోజే ఈ మూవీ టీజర్ కూడా విడుదల చేయాలని భావిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్ సరసన శ్రుతి హాసన్ నటిస్తోంది. జగపతి బాబు విలన్ గా మెప్పించనున్నారు.

## మరో తెలంగాణ నేపథ్యం..

# మేము ఫేమస్

ఈ మధ్య వెరైటీ ప్రమోషన్లతో యువ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు పెంచిన చిన్న సినిమా.. మేమ్ ఫేమస్. 'రైటర్ పద్మభూషణ్' సినిమాతో ఆకట్టుకున్న ఛాయ్ బిస్కెట్ సంస్థ ఈ చిత్రాన్ని యూట్యూబ్ షార్ట్స్ తో ఫేమస్ అయిన సుమంత్ అశ్విన్ తనే హీరోగా రూపొందించడం విశేషం. మాయి (సుమంత్ ప్రభాస్).. బాలి (మౌర్య).. దుర్గ (మణి ఏగుర్ల).. బండనర్సింపల్లి అనే తెలంగాణ పల్లెటూరిలో చిన్నపట్నుంచి స్నేహితులు. సరిగ్గా చదువుకోని ఈ ముగ్గురూ.. 20 ఏళ్లు దాటినా ఏ పనీ లేకుండా అల్లరి చిల్లరిగా తిరిగేస్తుంటారు. రోజూ తాగడం.. గొడవలు పెట్టుకుని పంచాయితీలు తేవడం.. ఇదే పనిగా ఉన్న ఈ స్నేహితుల్లో.. ఒక సంఘటన తర్వాత మార్పు వస్తుంది. జీవితంలో స్థిరపడేందుకు ఏదో ఒకటి చేయాలని ఊర్లో టెంట్ హౌస్ పెడతారు. అది బాగానే నడుస్తూ ఈ ముగ్గురు మిత్రుల జీవితాలు గాడిన పడ్డాయి అనుకుంటుండగా.. అనూహ్య పరిణామాలు జరుగుతాయి. ఈ పరిణామాలు ఏంటి.. తర్వాత వీరి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయి.. చివరికి ఏం జరిగింది అన్నది మిగతా కథ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక.. ఇక్కడి నేటివిటీని హైలైట్ చేస్తూ వినోదాన్ని.. ఎమోషన్లను పండించే కథలకు వెండితెరపై గిరాకీ పెరిగింది. ఈ కథలను యువ దర్శకులు తెలంగాణ అనే కాకుండా తెలుగు వాళ్లందరికీ రుచించేలా తీర్చిదిద్దుతుండటం విశేషం. జాతిరత్నాలు.. బలగం లాంటి సినిమాలను ప్రాంతీయ భేదం లేకుండా అందరూ చూశారు. 'జాతిరత్నాలు' సినిమా నవ్వుల్లో ముంచెత్తితే.. 'బలగం' ఎమోషన్లలో తడిసి ముద్దయ్యేలా చేసింది. ఇప్పుడు ఆ సినిమాల స్ఫూర్తితోనే సుమంత్ ప్రభాస్ అనే కుర్రాడు.. 'మేమ్ ఫేమస్' అంటూ వచ్చాడు. 'బలగం' తరహాలో పూర్తిగా పల్లెటూరి నేపథ్యంలో ఒక కథను అల్లుకుని 'జాతిరత్నాలు' తరహాలో లైట్ హార్టెడ్ స్టయిల్లో వినోదాన్ని పండించడానికి ప్రయత్నించాడు. అతను వేరే సినిమాలను అనుకరించే ప్రయత్నం చేసినా.. ఇందులోనూ ఒక నిజాయితీతో కూడిన ప్రయత్నం కనిపిస్తుంది. కాకపోతే ట్రైలర్ చూస్తే.. ఇదొక రేసీ ఎంటర్‌టైనర్ అని ఆశించిన వారికి నిరాశ తప్పదు. ఇందులో కొన్ని మూమెంట్స్ ఉన్నాయి. అక్కడక్కడా వినోదం పండింది. కానీ స్లో నరేషన్.. ఎగుడు దిగుడుగా సాగే కథనం సినిమాను కిందికి లాగాయి. ఓవరాల్ గా చూస్తే 'మేమ్ ఫేమస్' షార్ట్ ఫిలింకి ఎక్కువ.. ఫీచర్ ఫిలింకి తక్కువ అన్న ఫీలింగ్ కలుగుతుంది. మేమ్ ఫేమస్' సినిమాకు ట్రైలర్ అనేది ప్లస్సే కాదు.. మైనస్ కూడా. ఆ ట్రైలర్ చూసి ఇది రయ్యిన దూసుకెళ్లే ఎంట్టంల్గ÷నర్ అనుకుంటాం. సినిమా మీద అంచనాలు పెంచడానికి ట్రైలర్ ఉపయోగపడింది కానీ.. ఆ అంచనాలతో వెళ్లిన ప్రేక్షకులకు నిరాశ తప్పదు. 23 ఏళ్ల వయసులోనే హీరోగా నటిస్తూ దర్శకత్వం కూడా చేసిన సుమంత్ ప్రభాస్.. రైటర్ గా.. డైరెక్టర్ గా కొన్ని చోట్ల ప్రతిభను చాటుకున్నాడు కానీ.. తన నరేషన్లో మాత్రం వేగం లేదు.



ఆ వేగమే ఉంటే.. ఈ సినిమా 'జాతిరత్నాలు-2' అయ్యేదేమో. నిజానికి కథ.. పాత్రలు.. అనేక సన్నివేశాలు 'జాతిరత్నాలు' సినిమాను పదే పదే గుర్తుకు తెస్తాయి. అందులో మాదిరే ఇక్కడా ముగ్గురు హీరోలు. ఆ ముగ్గురూ ఒకర్ని మించిన జులాయి ఒకరు. ఊర్లో అల్లరి చిల్లరిగా తిరుగుతూ.. తాగి తందనాలాడుతూ.. అందరితో తిట్టించుకుంటూ.. పంచాయితీలు తెచ్చిపెడుతూ బతికేస్తుంటారు. కాకపోతే 'జాతిరత్నాలు' పూర్తిగా కామెడీ లక్ష్యంతోనే ఆరంభం నుంచి చివరిదాకా అల్లరిగానే సాగిపోతే.. ఇక్కడ ఒక దశ వరకే ఆ అల్లరి నడుస్తుంది. ఆ తర్వాత బాధ్యతలు.. లక్ష్యాలు అంటూ సీరియస్ మోడ్ లోకి వెళ్లిపోతుంది. ముగ్గురు కుర్రాళ్ల అల్లరితో ఉన్నంతలో బాగానే నవ్వించగలిగాడు రైటర్ కమ్ డైరెక్టర్ సుమంత్. అతను ఎక్కువ కష్టపడకుండా ఊర్లల్లో సగటు కుర్రాళ్ల జీవితాల్లో జరిగే విషయాలనే సన్నివేశాలుగా మార్చాడు. బెట్ మ్యాచ్ ఆడటం.. పెళ్లి బారాత్ లో డ్యాన్సులు చేయడం.. మందు కొడుతూ కనిపించిన కోడిని చంపి స్టఫ్ చేసుకోవడం.. ఇలా ప్రతిదాంతోనూ ఒక గొడవ.. ఒక పంచాయితీ.. ఇలా సాగిపోతాయి సన్నివేశాలు. ఒక దశ తర్వాత గొడవలు.. పంచాయితీలు ముదిరిపోయి జీవితంలో స్థిరపడటం కోసం ఈ కుర్రాళ్లు చేసే ప్రయత్నాల నేపథ్యంలో కథ ముందుకు నడుస్తుంది. ఐతే ప్రథమార్ధం వరకు ఒక మోస్తరు వినోదంతో బాగానే సాగిపోయే 'మేమ్ ఫేమస్'.. రెండో అర్ధంలో మాత్రం గాడి తప్పిన భావన కలుగుతుంది.మరీ అంచనాలు పెట్టుకోకుండా టైంపాస్ వినోదం కోసం అయితే ఒకసారి ట్రై చేయొచ్చు.

# ఓజి త్వరగా పూర్తి చేసే పనిలో పవన్

పవన్ కళ్యాణ్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇప్పటికే వినోదయ్య సీతమ్ సినిమా రీమేక్ షూటింగ్ ను ముగించాడు. ఆ రీమేక్ 'బ్రో' టైటిల్ తో జులై లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. బ్రో తర్వాత హరి మర వీరమల్లు సినిమా వస్తుందని అభిమానులతో పాటు అంతా అనుకున్నారు. హరిహర వీరమల్లు సినిమా కంటే ముందు పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఓజీ' సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగితే ఓజీ ఇదే ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇక ఈ సినిమా గురించి మరో ఆసక్తికర వార్త ఒకటి సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఓజీ సినిమాను దర్శకుడు సుజీత్ 'సాహో' రేంజ్ లో స్టైలిష్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందిస్తున్నాడట. అందుకే పాన్ ఇండియా రేంజ్ లో భారీ ఎత్తున విడుదల చేయాలని భావిస్తున్నారు.

అందుకు గాను సినిమాలో బాలీవుడ్ స్టార్స్ ను నటింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా బాలీవుడ్ కు చెందిన ఒక స్టార్ నటుడు ని ఈ సినిమా లో చర్చలు జరిగినట్లుగా తెలుస్తోంది. ఒకటి రెండు వారాల్లో ఆ విషయమై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. సినిమా పై ఇప్పటికే ఉన్న అంచనాలను మరింతగా పెంచే విధంగా బాలీవుడ్ స్టార్ ని రంగంలోకి దించబోతున్నట్లుగా యూనిట్ సభ్యులు కూడా ఆఫ్ ది రికార్డ్ చెబుతున్నారు.

ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకి



తమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. త్వరలోనే ఈ సినిమా నుండి గ్లిమ్స్ ను విడుదల చేసి సినిమా విడుదల తేదీ విషయంలో క్లారిటీ ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# పుష్ప-2తో బిజీగా బన్నీ

పుష్ప పార్ట్ 1 తో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్న అల్లు అర్జున్ ప్రస్తుతం పుష్ప 2 ని అదే రేంజ్ లో వచ్చేలా కష్టపడుతున్నాడు. సుకుమార్ అండ్ టీం కూడా పుష్ప 2ని




మరోసారి ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర హిట్ సినిమాగా నిలబెట్టాలని కృషి చేస్తున్నారు. సుకుమార్ చెప్పినట్టుగా అసలు కథ పార్ట్ 2లోనే ఉంటుందని తెలుస్తుండగా ఈ సీక్వెల్ మీద ఇప్పటికే ఆడియన్స్ ని ట్యూన్ చేసి ఉంచాడు సుక్కు. ఎంతైనా లెక్కల మాస్టర్ కదా ఆయన లెక్క పర్ఫెక్ట్ గా ఉందని పుష్ప 2 ఫస్ట్ టీజర్ చూస్తేనే అర్థమయ్యింది.

ఇదిలా ఉంటే ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ ప్లానింగ్ నెక్స్ట్ లెవెల్ లో ఉందని తెలుస్తుంది. పుష్ప 2 తర్వాత అఫీషియల్ గా సందీప్ వంగా తో సినిమా ఫిక్స్ చేసుకున్న అల్లు అర్జున్ ఆ సినిమా కన్నా ముందు త్రివిక్రం తో సినిమా చేస్తాడని తెలుస్తుంది. సుకుమార్ తో పుష్ప 2 పూర్తి చేసిన వెంటనే త్రివిక్రం సినిమా సెట్స్ మీద కు వెళ్లేలా బన్నీ ప్లాన్ చేస్తున్నారట. త్రివిక్రం అల్లు అర్జున్ ఈ ఇద్దరి కాంబినేషన్ కూడా సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. జులాయి తో మొదలైన వీరి కాంబో ఆ సినిమా హిట్ అందుకోగా ఆ తర్వాత వచ్చిన సన్నాఫ్ సత్యమూర్తి సినిమా కూడా ప్రేక్షకుల మనసులు గెలిచింది.ఇక హ్యాట్రిక్ సినిమాగా వచ్చిన అల వైకుంఠపురములో అయితే నాన్ బాహుబలి రికార్డులన్ని కూడా తిరగరాసింది. హ్యాట్రిక్ హిట్ల తర్వాత మరోసారి త్రివిక్రం అల్లు అర్జున్ కలిసి సినిమా చేయాలని ఫిక్స్ అయ్యారు. ఈ సినిమా కూడా పాన్ ఇండియా రేంజ్ లో అదిరిపోయేలా ఉంటుందని టాక్. ఆల్రెడీ పుష్ప తో పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకున్న అల్లు అర్జున్ ఇక మీదట తన సినిమాలన్నీ కూడా నేషనల్ వైడ్ గా రిలీజ్ ఎ÷-లాన్ చేస్తున్నారు. అయితే త్రివిక్రం అల్లు అర్జున్ హిట్ కాంబో కాబట్టి ఈ ఇద్దరి కాంబినేషన్ లో సినిమా మరింత స్పెషల్ గా ఉండేలా చూస్తున్నారట. ప్రస్తుతం మహేష్ తో సినిమా చేస్తున్న త్రివిక్రం అల్లు అర్జున్‌తో చేసే సినిమా కథ రెడీ చేసినట్టు తెలుస్తుంది. ఆల్రెడీ మూడు వరుస హిట్లు కొట్టిన కాంబినేషన్ కాబట్టి ఈ ఇద్దరి కలయికలో వస్తున్న సినిమాపై ఆడియన్స్ లో కూడా అంచనాలు భారీగా ఉన్నాయి.

పాన్ ఇండియా రేంజ్ లో వీరి బొమ్మ అదరగొట్టేలా ఎలాన్ చేస్తున్నారట. మరి ఈ సినిమాకు సంబంధించిన మిగతా డీటైల్స్ త్వరలో రానున్నాయి.

# 'దేవర' కోసం వచ్చిన కేజీఎఫ్ స్టార్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న 'దేవర' సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. పాన్ ఇండియా సినిమాగా రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన స్టార్ కాస్ట్ భారీగా పెరుగుతూనే ఉంది. బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా జాన్వీ కపూర్ కు తెలుగు లో మొదటి సినిమా. ఇక బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. సైఫ్ అలీ ఖాన్ 'దేవర' సినిమాలో నటించడం వల్ల బాలీవుడ్ లో మంచి బజ్ క్రియేట్ అవ్వడం ఖాయం అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో మరో పాన్ ఇండియా స్టార్ ని ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. కన్నడ సూపర్ హిట్ చిత్రం 'కేజీఎఫ్' లో కీలక పాత్రలో నటించిన తారక్ పొన్నప్ప కి పాన్ ఇండియా గుర్తింపు దక్కింది. కేజీఎఫ్ లో ఇతడు పోషించిన పాత్ర చిన్నదే అయినా కూడా గుర్తుండిపోయే పాత్ర. కనుక దేవర సినిమాలో ఛాన్స్ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. సినిమాలోని కీలక పాత్రలో కనిపించబోతున్నారు.



ప్రస్తుతం ఎన్టీఆర్ మరియు తారక్ పొప్పన్న కాంబోలో సన్నివేశాల చిత్రీకరణ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే నెలలో మరో కీలక షెడ్యూల్ లో కూడా తారక్ పొప్పన్న పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక సైఫ్ అలీ ఖాన్ మరియు ఎన్టీఆర్ కాంబో సన్నివేశాల్లో కూడా తారక్ పొప్పన్న ఉంటాడనే సమాచారం అందుతోంది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. దేవర షూటింగ్ పూర్తి అయిన వెంటనే ఎన్టీఆర్ 'వార్' సీక్వెల్ షూట్ లో పాల్గొనబోతున్నాడు. వచ్చే ఏడాదిలో దేవర తో పాటు వార్ కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

PRINTED AND PUBLISHED BY V NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO , RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com